teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు ...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 156 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 2 డిసెంబర్ 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## దేశంలోనే 7వ ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా శామీర్‌పేట

రాష్ట్రంలో అగ్రస్థానం
సైబరాబాద్‌దే
సైబరాబాద్ కమిషనరేట్‌కు
దక్కిన ప్రతిష్ఠాత్మక గౌరవం
కేంద్ర హోం వ్యవహారాల
మంత్రిత్వ శాఖ గుర్తింపు






# రూపాయి పతనం

## విలువ ఆల్‌టైమ్ $. 89.83కి కనిష్టం

| అంశం | మార్పు |
|---|---|
| రూపాయి విలువ (డాలర్‌తో పోలిస్తే) | 34 పైసలు క్షీణత |
| సెన్సెక్స్ | 64.77 పాయింట్లు పతనం |
| నిఫ్టీ | 27.20 పాయింట్లు పతనం |

స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ముగింపు

డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 34 పైసలు క్షీణింపు

భారత కరెన్సీపై పెరిగిన ఒత్తిడి



మనదేశ కరెన్సీ రూపాయి విలువ ఆల్‌టైమ్ కనిష్టానికి చేరింది. దేశీయ ఈక్విటీ మార్కెట్లలో ప్రతికూల ధోరణి, విదేశీ నిధుల ఉపసంహారణ కారణంగా సోమవారం అమెరికా డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 34 పైసలు క్షీణించి ఆల్‌టైమ్ కనిష్ట స్థాయి రూ. 89.83కి చేరుకుంది. డాలర్ బలంగా ఉండటం, అంతర్జాతీయ ముడి చమురు ధరల పెరుగుదల భారత కరెన్సీని దెబ్బతీశాయని ఫారెక్స్ ట్రేడర్లు తెలిపారు.

## ఐపీఎస్ అధికారులు ఐఏఎస్ క్యాడర్‌లో ఎందుకు..?

### తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ
### డిసెంబర్ 10 లోపు వివరణ ఇవ్వాలని సీఎస్ కు ఆదేశం

హైదరాబాద్, డిసెంబర్ 01 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. శిఖా గోయల్, సీవీ ఆనంద్, స్టీఫెన్ రవీంద్ర లాంటి ఐపీఎస్ ఆఫీసర్లను ఐఏఎస్ క్యాడర్లో ఎందుకు కొనసాగిస్తున్నారో వివరణ ఇవ్వాలని సోమవారం చీఫ్ సెక్రటరీకి నోటీసులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబర్ 26వ తేదీన విడుదల చేసిన జీవో 1342 ప్రకారం పలువురు ఐపీఎస్ అధికారులకు, ఐఏఎస్ హోదా కల్పించిందని అది చట్టవిరుద్ధమని హైకోర్టులో వడ్ల శ్రీకాంత్ అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సోమవారం హైకోర్టు విచారించింది. శ్రీకాంత్

మిగతా 2 లో





## రూ.50 వేల కోట్ల స్కాంను బయటపెట్టాను

- అందుకే నన్ను టార్గెట్ చేస్తున్నారు
- రామగుండం ప్లాంట్‌పై హరీశ్ రావు సంచలన ఆరోపణలు
- కమీషన్ల కోసమే కొత్త ప్లాంట్
- రూ.82 వేల కోట్ల భారం ప్రజలపై : మాజీ మంత్రి

హైదరాబాద్, డిసెంబర్ 01 (తీన్మార్ న్యూస్): రామగుండం థర్మల్ విద్యుత్ కేంద్రంలో రూ. 50 వేల కోట్ల స్కాంను బయటపెట్టినందుకే తనను టార్గెట్ చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. థర్మల్ విద్యుత్ ను

మిగతా 2 లో


## డిజిటల్ అరెస్ట్ లపై "సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం"




దేశవ్యాప్తంగా సీబీఐ విచారణకు ఆదేశం
రాష్ట్రాలు, ఆర్బీఐకి నోటీసులు
ఏఐ టెక్నాలజీపై కీలక ప్రశ్నలు
సుప్రీంకోర్టు సుమోటో విచారణ..
మోసాలపై కఠిన వైఖరి

.. వివరాలు 2లో

## ప్రాంప్ట్ ఇంజెక్షన్ గండం



AI చాట్‌బోట్‌ల డేటా భద్రతపై
సీపీ సజ్జనార్ హెచ్చరిక
మాటల మాయతో
కీలక డేటాకు ముప్పు
గార్డ్‌రెయిల్స్ తప్పనిసరి :
సజ్జనార్ ఆసక్తికర పోస్ట్

.. వివరాలు 2లో




02

## మరోసారి భారీగా బ్యాంకుల విలీనం

- 12 నుంచి 4కు తగ్గించే యోచనలో కేంద్రం
- కెనరా - యూనియన్ బ్యాంకుల విలీనానికి సన్నాహాలు
- 2026-27 ఆర్థిక సం. లోనే విలీన ప్రక్రియ పూర్తి?

## రాజ్‌భవన్ 'లోక్‌భవన్'గా నామకరణ మార్పు

### గవర్నర్ అధికారిక నివాసాలకు కొత్త పేరు
### కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం




న్యూ ఢిల్లీ, డిసెంబర్ 01 (తీన్మార్ న్యూస్): దేశంలోని గవర్నర్ల నివాసాలైన 'రాజ్‌భవన్'లు ఇకపై 'లోక్‌భవన్'లు మారబోతున్నాయి. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల గవర్నర్ల అధికారిక నివాసాలైన 'రాజ్‌భవన్'లను

మిగతా 2 లో




## ఓల్డ్ సిటీ మెట్రో కనెక్టివిటీకి గ్రీన్‌సిగ్నల్

పాతబస్తీ మెట్రో ప్రాజెక్ట్‌కు రూ.125 కోట్లు మంజూరు
మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్మెంట్ జీఓ జారీ


హైదరాబాద్, డిసెంబర్ 01 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్‌లోని పాతబస్తీ వాసులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఓల్డ్ సిటీ మెట్రో రైల్వే కనెక్టివిటీ పనులకు తెలంగాణ ప్రభుత్వం మరొక కీలక అడుగు వేసింది. 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో భాగంగా 'మెట్రో కనెక్టివిటీ టూ ఓల్డ్ సిటీ' పథకం కింద

## ఐబొమ్మ రవి కేసులో కీలక విషయాలు వెల్లడి

- పైరసీ నెట్‌వర్క్, విదేశీ ఎక్స్‌పర్ట్‌ల సహకారం
- రెండో విడత కస్టడీలో కీలక సమాచారం సేకరణ
- పూర్తిగా సహకరించిన ఐబొమ్మ రవి




.. వివరాలు 2లో




## మహిళా శక్తికి ఆర్టీసీ బలం

- మరో 448 అద్దె బస్సుల కొనుగోలుకు సెర్ప్ సిద్ధం
- సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్ లేఖ
- బస్సుల సంఖ్య 600కు పెంపు లక్ష్యం

హైదరాబాద్, నవంబర్ డిసెంబర్ 01 (తీన్మార్ న్యూస్): సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) ఎండీ నాగిరెడ్డికి కీలక లేఖ

మిగతా 2 లో



# రెండేళ్లుగా పెండింగ్‌లో కొత్త అక్రిడిటేషన్లు






**కొత్త గైడ్ లైన్స్ పేరుతో కాలయాపన**

**అక్రిడిటేషన్ కార్డుల జారీలో జాప్యం తగదు..**

**ప్రభుత్వం దిగిరాకపోతే భారీ ఆందోళన తప్పదు**

**అర్హులైన జర్నలిస్టులకు తీవ్ర అన్యాయం: రెడ్డి శేఖర్**

**తక్షణమే కార్డులు జారీ చేయాలి: టీఏజేఎఫ్ హెచ్చరిక**

హైదరాబాద్, డిసెంబర్ 01 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీలో ప్రభుత్వం చేస్తున్న తీవ్ర జాప్యంపై 'తెలంగాణ ఆల్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డి శేఖర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సుమారు రెండు సంవత్సరాలుగా రాష్ట్రంలో కొత్త అక్రిడిటేషన్ కార్డుల ప్రక్రియ నిలిచిపోవడంతో, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులు, చిన్న, మధ్య స్థాయి పత్రికల ఎడిటర్లు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రెడ్డి శేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం 'కొత్త గైడ్ లైన్స్' పేరుతో అక్రిడిటేషన్ల జారీని పెండింగ్‌లో ఉంచడం సరికాదని హితవు పలికారు. ఏళ్ళు గడుస్తున్నా, అసలు జాప్యానికి గల కారణాలను ప్రభుత్వం క్లుప్తంగా వివరించలేకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తేవడంలోనూ కీలక పాత్ర పోషించే జర్నలిస్టుల పట్ల ఈ రకమైన నిర్లక్ష్య వైఖరి సమాజానికి ఏ మాత్రం శ్రేయస్కారం కాదని స్పష్టం చేశారు. అక్రిడిటేషన్ అనేది జర్నలిస్టుల హక్కు అని, దానిని వెంటనే పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. అర్హత ఉన్న ప్రతి జర్నలిస్టుకు, చిన్న పత్రికల యజమానులకు (ఏంపన్నెల్మెంట్) న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించని పక్షంలో, టీఏజేఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులను ఏకం చేసి భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డి శేఖర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు

# రూపాయి పతనం





న్యూ ఢిల్లీ, డిసెంబర్ 01 (తీన్మార్ న్యూస్): మనదేశ కరెన్సీ రూపాయి విలువ ఆల్‌టైమ్ కనిష్టానికి చేరింది. దేశీయ ఈక్విటీ మార్కెట్లలో ప్రతికూల ధోరణి, విదేశీ నిధుల ఉపసంహరణ కారణంగా సోమవారం అమెరికా డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 34 పైసలు క్షీణించి ఆల్‌టైమ్ కనిష్ట స్థాయి రూ. 89.83కి చేరుకుంది. డాలర్ బలంగా ఉండటం, అంతర్జాతీయ ముడి చమురు ధరల పెరుగుదల భారత కరెన్సీని దెబ్బతీశాయని ఫారెక్స్ ట్రేడర్లు తెలిపారు. మరోవైపు, దిగుమతిదారుల నుంచి డాలర్ డిమాండ్ కూడా మన కరెన్సీపై ఒత్తిడి పెంచింది. ఈ వారం ఇంటర్‌బ్యాంక్ విదేశీ ద్రవ్య మార్కెట్లో రూపాయి రూ. 89.45 వద్ద ప్రారంభమైంది. ఆ తర్వాత మరింత బలహీనపడి రూ. 89.83కి పడిపోయింది. ఎఫ్‌పీఐలు మన మార్కెట్ల నుంచి నిధులను వెనక్కి తీసుకోవడం, అధిక వాల్యుయేషన్, చమురు బంగారం కొనుగోళ్ల కారణంగా రూపాయి ఒత్తిడిలోకి చేరిందని ఫిన్‌రెక్స్ ట్రెజరీ అడ్వైజర్ ఎల్‌ఎల్‌పీ హెడ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనిల్ కుమార్ భన్సాలి అన్నారు. అమెరికాతో వాణిజ్య చర్చల ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయని, ఏడాది చివరి నాటికి పరిష్కారం లభిస్తుందనే అంచనాలున్నాయని ఆయన పేర్కొన్నారు.

సోమవారం దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. ఉదయం సానుకూలంగానే ట్రేడింగ్ మొదలైనప్పటికీ కొద్దిసేపటి తర్వాత నష్టాల్లోకి జారాయి. ఇందుకు ప్రధానంగా ఆర్‌బీఐ రేటు తగ్గింపుపై అంచనాలు తగ్గడం, బలమైన జీడీపీ వృద్ధి, తక్కువ ద్రవ్యోల్బణ పరిస్థితుల మధ్య సెంట్రల్ బ్యాంకు రేట్లను స్థిరంగా ఉంచవచ్చనే ఊహాగానాలు పెరిగాయి. దీనికి తోడు రూపాయి జీవితకాల కనిష్టానికి చేరడం, అమెరికాతో వాణిజ్యంపై ఆందోళనలు మార్కెట్ల బలహీనతకు కారణమయ్యాయి. దీంతో మార్కెట్లు ముగిసే సమయానికి సెన్సెక్స్ 64.77 పాయింట్లు పడిపోయి 85,641 వద్ద, నిఫ్టీ 27.20 పాయింట్లు తగ్గి 26,175 వద్ద ముగిశాయి. సెన్సెక్స్ ఇండెక్స్‌లో టీఎంపీవీ, మారుతీ సుజుకి, బీఈఎల్, కోటక్ బ్యాంక్, అదానీ పోర్ట్స్ షేర్లు లాభాలను దక్కించుకున్నాయి. బజాజ్ ఫైనాన్స్, సన్‌ఫార్మా, ట్రెంట్, ఎస్‌బీఐ, బజాజ్ ఫిన్‌సర్వ్, భారతీ ఎయిర్‌టెల్ స్టాక్స్ నష్టాలను నమోదు చేశాయి.

## ఓల్డ్ సిటీ మెట్రో కనెక్టివిటీకి గ్రీన్‌సిగ్నల్



మొదటి పేజీ తరువాయి

రూ.125 కోట్లను విడుదల చేస్తూ ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్మెంట్ (బడ్జెట్) శాఖ సోమవారం జీఓ జారీ చేసింది. ఆదేశాల ప్రకారం మంజూరైన ఈ నిధులను సంబంధిత బడ్జెట్ ప్రొవిజన్ నుంచి రిలీజ్ కానుంది. విడుదలైన మొత్తాన్ని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ ఖాతాకు మళ్లించేందుకు ట్రెజరీ శాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఓల్డ్ సిటీలో మెట్రో విస్తరణకు ఇప్పటికే పలు సార్లు ప్రకటనలు వచ్చిన నేపథ్యంలో తాజా నిధుల విడుదలతో ప్రాజెక్టు పురోగతికి దోహదం కానుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

## ఐపీఎస్ అధికారులు ఐఏఎస్ క్యాడర్‌లో ఎందుకు..?



మొదటి పేజీ తరువాయి

తరపున విజయ్ గోపాల్ అనే న్యాయవాది వాదించారు. శిఖా గోయల్, సీవీ ఆనంద్, స్టీఫెన్ రవీంద్ర లాంటి ఐపీఎస్ అధికారులకు ఐఏఎస్ హోదా ఎందుకు కల్పించారో డిసెంబర్ 10వ తేదీ లోపు వివరణ ఇవ్వాలని చీఫ్ సెక్రటరీకి కోర్టు నోటీసులు జారీ చేసింది.

## రూ.50 వేల కోట్ల స్కాంను బయటపెట్టాను

మొదటి పేజీ తరువాయి

తగ్గిస్తామని చెప్పి కొత్త ప్లాంటు ఎందుకు కడుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. కమీషన్ల కోసమే కొత్త థర్మల్ ప్లాంట్ నిర్మిస్తున్నారని ఆరోపించారు. రూ.10,800 కోట్లతో జెన్కో డీపీఆర్ ఇచ్చింది వాస్తవం కాదా.? అని ప్రశ్నించారు. ఎన్టీపీసీ వాళ్లు రూ. 4.12 పైసలకు యూనిట్ ఇస్తామంటే ప్రభుత్వం ముందుకు రాలేదన్నారు .ఎన్టీపీసీ 2400 మెగావాట్ల విద్యుత్ ఇస్తామంటే ఎందుకు ముందుకు రావట్లేదని ప్రశ్నించారు హరీశ్. రామగుండం కొత్త థర్మల్ ప్రాంట్ తో రోజూ ప్రజలపై రూ. 9 కోట్ల భారం పడుతుందని చెప్పారు హరీశ్. 25 ఏండ్లకు కొత్త ప్లాంట్ తో ప్రజలపై రూ. 82 వేల కోట్ల భారం పడుతుందన్నారు. తక్కువ ధరకు వచ్చే విద్యుత్ ను ఎందుకు వద్దంటున్నారని ప్రశ్నించారు. రూ.82 వేల కోట్ల భారం ప్రజలెందుకు భరించాలన్నారు హరీశ్. కాంగ్రెస్ వచ్చిన తర్వాతే కరెంట్ లో ఈ దుస్థితి వచ్చిందన్నారు.

## ఐబొమ్మ రవి కేసులో కీలక విషయాలు వెల్లడి

హైదరాబాద్, డిసెంబర్ 01 (తీన్మార్ న్యూస్): తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఐబొమ్మ రవి రెండో విడత పోలీస్ కస్టడీ ముగిసిన విషయం తెలిసిందే. మూడు రోజుల పాటు జరిగిన నిందితుడి మెయిల్స్ నుంచి కీలక సమాచారాన్ని సైబర్ క్రైమ్ పోలీసులు సేకరించారు. ఈ మేరకు ఐబొమ్మ రవి విచారణ అంశాలపై క్రైమ్స్ అడిషనల్ సీపీ శ్రీనివాసులు స్పందించారు. ఈ సందర్భంగా ఆయన ఓ మీడియా చానెల్‌తో మట్లాడుతూ రెండోసారి కస్టడీలోకి తీసుకున్నప్పుడు ఐబొమ్మ రవి పూర్తిగా సహకరించాడని తెలిపారు. ఎన్నో అంశాలు అతని నుంచి సేకరించినట్లు ఆయన తెలిపారు. పైరసీ విషయంలో వివిధ దేశాలకు చెందిన ఎక్స్‌పర్ట్స్‌ని రవి హైర్ చేసుకుని పైరసీ నెట్వర్క్ నడిపించాడని క్లారిటీ ఇచ్చారు. కరేబియన్ దీవులు కొందరు, సర్వర్ల విషయంలో స్విట్జర్లాండ్‌లో కొందరి సహకారం తీసుకున్నారని చెప్పారు. పోస్టుల డెవలప్ కోసం అఖిల్ అనే వ్యక్తిని హైర్ చేసినట్లు తెలిపారు. వారందరికీ డబ్బులు ఇచ్చి పని చేయించుకున్నాడని కీలక వ్యాఖ్యలు చేశారు. అఖిల్ అనే వ్యక్తి గురించి ఇంకా దర్యాప్తు జరుగుతుందని, మొత్తం డేటా సేకరించిన తర్వాత ప్రసిక్యూషన్‌కి వెళ్తామని స్పష్టం చేశారు. రవి సంపాదించిన డబ్బుతో హైదరాబాద్, వైజాగ్ లో ఆస్తులు కూడబెట్టుకున్నాడని వెల్లడించారు. ఐబొమ్మ కరేబియన్ పౌరసత్వం తీసుకున్నారని, కరేబియన్ దీవుల్లో ఏదైనా ఆస్తుల గురించి చెప్పలేమని అన్నారు. ఎందుకంటే అక్కడ డేటా అంతా సిక్రేట్‌గా ఉంటుందని, డేటా అనేది రివీల్ చేయరని, ట్యాక్స్ ఎగ్గొట్టే వారు అక్కడే షెల్టర్ తీసుకుంటారని చెప్పుకొచ్చారు. అయితే అతనికి అక్కడ ఆస్తులు లేవని అతను చెప్పాడని అన్నారు. అయితే, ఐబొమ్మ రవి భార్య వల్లే పట్టుబడినట్లు నడుస్తున్న ప్రచారం మొత్తం కల్పిత కథ అని క్రైమ్స్ అడిషనల్ సీపీ స్పష్టం చేశారు. ఆయన భార్య అతనికిగాని, తమకు గానీ టచ్‌లోకి రాలేదని అన్నారు. ఆమె సహకారంతోనే పట్టుకున్నామని ప్రచారం జరిగిందని, అది అంతా కల్పితం అని స్పష్టం చేశారు. ఐబొమ్మ రవి వేరే సోర్సెస్ ద్వారా తమకు పట్టుబడ్డారని అన్నారు. ఐబొమ్మ రవి మెయిల్స్ ద్వారా చాలా ఇన్ఫర్మేషన్ ఉందని, ప్రాసిక్యూషన్‌కు అదే హెల్ప్ అవుతుందని తెలిపారు.

## రాజ్‌భవన్ 'లోక్‌భవన్'గా నామకరణ మార్పు




మొదటి పేజీ తరువాయి

'లోక్‌భవన్'గా మారుస్తూ కేంద్ర గృహనిర్మాణ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే యూనియన్ టెరిటరీల్లోని 'రాజ్ నివాస్'లను 'లోక్ నివాస్'గా మారుస్తున్నట్టు పేర్కొంది. రాజ్‌భవన్ అనే పేరు బ్రిటిష్ వలసవాదాన్ని సూచిస్తుందని, లోక్‌భవన్‌గా మార్చడం ద్వారా ప్రజాస్వామ్య పంథాలో ప్రజల భవనం లాగ సూచిస్తుందని తెలిపారు. ఈ ఆదేశాలు నవంబర్ 25 నే రాగా ఆ వెంటనే పశ్చిమ బెంగాల్, త్రిపురా, కేరళ, తమిళనాడు, అస్సాం తదితర రాష్ట్రాలు డిసెంబర్ 1 నుంచి అమలు చేస్తూ సైన్‌బోర్డులు, అధికారిక వెబ్‌సైట్లు, లెటర్‌హెడ్‌లు మార్చేశాయి. అయితే పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ, తమిళనాడులో డీఎంకే వంటి ప్రతిపక్ష పార్టీలు రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు లేకుండా కేంద్రం ఏకపక్ష నిర్ణయం తీసుకుందని మండిపడ్డాయి. ఇది కేవలం పేరు మార్చడం కాదు రాజకీయ ఉద్దేశంతో చేసిందేనని విమర్శిస్తున్నాయి. కాగా తమిళనాడు గవర్నర్ రవి నేతృత్వంలోని కమిటీ ఈ సిఫార్సు చేసినట్టు సమాచారం.

# ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, డిసెంబర్ 01 (తీన్మార్ న్యూస్): సోమవారం ఐడిఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో సివిల్ సప్లై, ట్రాన్స్ పోర్ట్, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, కోపరేటివ్, మార్కెటింగ్ శాఖల అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా త్వరిత గతిన ధాన్యం కొనుగోళ్ల చేపట్టాలని అన్నారు. కొన్ని కొనుగోలు కేంద్రాలలో నిర్వాహకులు అందుబాటులో ఉ ఒడడం లేదని, ట్యాబ్ ఎంట్రీ చేసి నివేదికలు అందించే విషయం ఆలస్యం అవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలలో అందుబాటులో లేని నిర్వాహకులను సస్పెండ్ చేస్తామని, అలాగే సంబంధిత అధికారులకు చర్యలు తప్పవని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల వద్ద సెంటర్ ఇంచార్జీలు కచ్చితంగా అందుబాటులో ఉండాలని, ప్రతి రోజు రిజిస్టర్లు లో నమోదు చేయాలని ఆదేశించారు. ధాన్యాన్ని ప్రతి రోజు తేమ శాతం పరీక్షించి రిజిస్టర్ లో నమోదు చేయాలని సూచించారు. ఏ రోజు కారోజు కొనుగోలు చేసిన ధాన్యం ట్యాబ్ ఎంట్రీ చేయాలని తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ఐరిస్ ద్వారా ట్యాబ్ ఎంట్రీ చేయించుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు పై అన్ని శాఖల నుండి ప్రతి రోజు నివేదిక అందించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద బోర్డు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. 24 గంటలలో ట్యాబ్ ఎంట్రీ చేయాలని సెంటర్ల వారిగా, మండలాల వారిగా నివేదిక అందించాలని తెలిపారు. మండలాలలో మండల ప్రత్యేక అధికారులు తహసిల్దార్లు ప్రతి రోజు పర్యవేక్షణకు పంపిస్తానని ఆలసత్వం వహిస్తే కేంద్రాల ఇంచార్జీలను సస్పెండ్ చేస్థానాన్ని, అలాగే సంబంధిత శాఖల అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమన్వయం ఉండాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌరసరఫరాల అధికారి కిరణ్ కుమార్, పౌర సరఫరాల సంస్థ డిఎం రాములు, ఆర్టిఓ సంధాని, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, సహకార అధికారి వాలియా నాయక్, డిఆర్డిఓ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# విజన్ 2047 సర్వేలో భాగస్వామ్యం కావాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, డిసెంబర్ 01 (తీన్మార్ న్యూస్): రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగంలో అగ్రగామిగా నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ విజన్ -2047 డాక్యుమెంట్ రూపొందిస్తోం దని, ఈ సర్వేలో ఉద్యోగులందరూ పాల్గొనాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రూపొంది స్తున్న ఈ విజన్ 2047 డాక్యుమెంటరి తయారీలో ప్రతి ఒక్క పౌరుడు భాగస్వామ్యం అయ్యేలా సిటిజన్ సర్వే చేపట్టారని తెలిపారు. అక్టోబర్ 10న ప్రారంభమైన ఈ సర్వేలో రాష్ట్ర ప్రజలు, ఎన్ఆర్ఐలు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని, ప్రతీ శాఖ అధికారి, సిబ్బంది పాల్గొని తమ విలువైన సలహాలు, సూచనలు అందించాల్సిందిగా ఆయన తెలిపారు. ఈ సర్వేలో అన్ని శాఖల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొనడంతో పాటు ఈ సర్వే లింక్, క్యూఆర్ కోడ్ ను తమ కార్యాలయాల్లో ప్రదర్శించడంతో పాటు విస్తృత ప్రచారం నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సర్క్యులర్ జారీ చేసారని తెలిపారు. లింక్ https:/www.telangana.gov.in/telanganarising అన్ని శాఖల అధికారులు, సిబ్బంది నమోదుపై నివేదికలు అందచేయాలని ఆదేశించారు.

# అద్దె గదుల బకాయిలు నిర్ణీత గడువులోపు చెల్లించాలి

## శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి



పరకాల, డిసెంబర్ 01 (తీన్మార్ న్యూస్): అద్దె గదుల బకాయిలు నిర్ణీత గడువులోపు చెల్లించాలి అని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. సోమవారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు మున్సిపల్ శాఖ అధికారులతో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపాలిటీకి సంబంధించిన అద్దె గదుల బకాయి దారులు నిర్ణీత గడువులోపు చెల్లించాలని అన్నారు. అలాగే చెల్లించవలసిన బకాయి 4 విడతల్లో చెల్లింపు చేయుటకు అవకాశం కల్పించామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, టిపిఓ సుష్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ రహిత జిల్లాగా మారుద్దాం

### ఘనంగా ప్రపంచ ఎయిడ్స్ డే వేడుకలు

### అడిషనల్ సివిల్ జూనియర్ జడ్జి అఖిల

### డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ మధుసూదన్




భూపాలపల్లి, డిసెంబర్ 01 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లాను ఎయిడ్స్ రహిత జిల్లాగా మారుద్దామని భూపాలపల్లి అడిషనల్ సివిల్ జూనియర్ జడ్జి జి అఖిల, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చల్లా మధుసూదన్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి మున్సిపల్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జడ్జ్ అఖిల, డి ఎం హెచ్ ఓ డాక్టర్ మధుసూదన్ జండా ఊపి ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం సమావేశం మందిరంలో జిల్లా ఎయిడ్స్, లెప్రసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఉమాదేవి సారధ్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అడిషనల్ సివిల్ జూనియర్ జడ్జి జి అఖిల మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి నిర్ధారణ రోగులకు ఎఆర్టి మందులతో పాటు వారి జీవన విధానంలో మార్పు తీసుకొని రావడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చల్ల మధుసూదన్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్ సెంటర్లతో పాటు గ్రామాల్లో కూడా హెచ్ఐవి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. గర్భిణీలకు అన్ని రకాల రక్త పరీక్షల ప్రొఫైల్ నిర్వహించడం జరుగుతుందని వివరించారు. త్వరలో భూపాలపల్లి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఐసీటీసీ, ఏఆర్టి కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. జిల్లా డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ కె శ్రీదేవి మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి నిర్ధారణ పరీక్షలను విస్తృతంగా నిర్వహించడానికి ప్రణాళిక బద్ధంగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మాత శిశు సంరక్షణ కోసం, గర్భిణి హెచ్ఐవి పాజిటివ్ వ్యక్తుల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టి ప్రసవాలు చేపడుతున్నామని వివరించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులలో హెచ్ఐవి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. పులి రాజాకు ఎయిడ్స్ అనే నినాదం గతంలో ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం జరిగిందని పేర్కొన్నారు. జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఉమాదేవి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎయిడ్స్ వ్యాధి పరీక్షలు నిర్వహిస్తున్నామని, వ్యాధి నివారణకు విస్తృతంగా ప్రచారం చేపట్టినట్లు వివరించారు. ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపెయిన్ కార్యక్రమాలతో పాటు అన్ని సబ్ సెంటర్లలో కూడా అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్ష లతోపాటు హెచ్ఐవి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని నివేదిక ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ ఎయిడ్ సర్వీస్ అథారిటీ సెక్రెటరీ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, దిశ డీఎండిఓ సాయికుమార్, ఐసిటిసి కౌన్సిలర్ గాదె రమేష్, మారి స్వచ్ఛంద సంస్థ ప్రోగ్రాం మేనేజర్ సదానందం, ట్రాన్స్ జెండర్ జిల్లా టీం లీడర్ గౌరీ, జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రశంసా పత్రాలు అందించారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

# స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలి



## పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి

సంగెం, డిసెంబర్ 01 (తీన్మార్ న్యూస్): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలి అని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. సోమవారం సంగెం మండలం బాలు నాయక్ తండా గ్రామం నుండి బిఆర్ఎస్ ఎస్టీ సెల్ అధ్యక్షులు వాంకుడోత్ తిరుపతి, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు బానోతు శ్రీను, బానోతు బాలు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని, పాత కొత్త తేడా లేకుండా అందరూ సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాలి అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీలోకి చేరిన వారిలో బానోతు వీరు, బానోతు రాజు, బుజేందర్, వెంకటేష్, గోపి, బద్రు, మోహన్ దాదాపు 30 మంది కాంగ్రెస్ పార్టీలోకి చేరారు.

# రాజనీతి శాస్త్ర జాతీయ సెమినార్ బ్రోచర్ విడుదల




హనుమకొండ కేయు, డిసెంబర్ 01 (తీన్మార్ న్యూస్): కాకతీయ యూనివర్సిటీ రాజనీతి శాస్రం ఆధ్వర్యంలో 2026, ఫిబ్రవరి 16, 17 తేదీలలో పోపులిస్ట్ పాలసీస్ %అఅ% పోస్ట్ లైబరాలిజషన్ ఇండియా (సరళీకరణ అనంతరం భారతదేశంలో జన రంజక విధానాలు) అనే అంశం మీద రెండు రోజులు జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నారు దీనికి సంబంధించిన బ్రోచర్ ను యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాపరెడ్డి మరియు రిజిస్ట్రా ర్ వల్లూరి రామచంద్రం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ 1947 భారతదేశానికి స్వాతంత్రం అనంతరం ప్రవేశపెట్టిన మిశ్రమ ఆర్థిక విధానాలు ప్రజలకు సరైన అభివృద్ధికి తోడ్పడకపోవడం వల్ల ప్రపంచవ్యాప్తంగా వచ్చిన ఆర్థిక విధానాలు అనుగుణంగా దేశంలో సరళీకృత ఆర్థిక విధానాలు అమలు చేయడం జరిగింది. భారత దేశం ప్రభుత్వ రంగానికి బదులుగా ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహిస్తూ పారిశ్రామిక విధానాలను అమలు చేస్తున్నది మరోవైపు ఈ ప్రైవేటు రంగాన్ని మైమర్పించడానికి అభివృద్ధికి అవకాశం లేని ప్రజారంగక విధానాలను అమలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తున్నాయి ఈ విధానాలపై దేశవ్యాప్తంగా చర్చ జరగవలసిన అవసరం ఉందని దేశంలో ఉన్న యూనివర్సిటీలు ఈ సెమినార్ లో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి ఒక విధాన రూపకల్పన తయారుచేసి పంపించాలని ఇంతటి మంచి సెమినార్ ను ఏర్పాటు చేస్తున్న రాజనీతి శాస్త్ర అధ్యాపక బృందానికి వీసీ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యు జి సి కోఆర్డినేటర్ ఆచార్య రాగడి మల్లికార్జున రెడ్డి, డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సోషల్ సైన్స్ ఆచార్య బానోతు సురేష్ లాల్, యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య తాళ్లపల్లి మనోహర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య కట్ల రాజేందర్, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకటయ్య, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ గడ్డం కృష్ణయ్య, రాజనీతి శాస్త్రం అధ్యాపకులు డాక్టర్ వడ్లకొండ సత్యనారాయణ, డాక్టర్ నాగరాజు వాడపల్లి, డాక్టర్ లలిత కుమారి, డాక్టర్ భాగ్యమ్మ, డాక్టర్ సంజీవ్, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ సోమలింగం, కళ్లేపల్లి ప్రశాంత్, గుండు సురేష్, రాజనీతి శాస్త్ర రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# హెచ్ఐవి రహిత జిల్లాగా నిర్మించడంలో యువత పాత్ర కీలకం

## జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్




మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 01 (తీన్మార్ న్యూస్): మహబూబాబాద్ జిల్లాను హెచ్.ఐ.వి.రహిత జిల్లాగా నిర్మించడంలో యువత పాత్ర కీలకమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకొని మహబూబాబాద్ పట్టణంలోని స్థానిక ఐ.యం.ఏ హాల్ లో జరిగిన కార్ర్యమంలో ఆయన మాట్లాడుతూ హెచ్.ఐ.వి. వ్యాధిగ్రస్తులు అందరూ మందులు క్రమం తప్పకుండా వాడుతూ, పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని, ఆత్మస్థైర్యంతో అన్ని రంగాలలో రాణించాలని తెలిపారు.అంతే కాకుండా విద్యార్థులు, అన్నీ శాఖల సమన్వయంతో ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఈ వ్యాది నివారణ లో తమ వంతు పాత్ర పోషించాలని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ వైద్య ఆరోగ్య శాఖ పక్షాన నిర్వహిస్తున్న కార్యక్రమాల పైన వివరించడం జరిగింది హెచ్ఐవి సోకిన తల్లి నుండి బిడ్డకు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మందులు క్రమం తప్పకుండా తీసుకొని ఏ.ఆర్.టి. సిబ్బందిచే సలహాలను తీసుకొని జీవన ప్రమాణాన్ని పెంచుకోవాలని తెలిపారు. జిల్లా జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస రావు మాట్లాడుతూ ముఖ్యంగా యువత హెచ్ఐవి బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరూ హెచ్ఐవి టెస్ట్ చేయించుకొని తమ యొక్క హెచ్ఐవి స్థితిని తెలుసుకోవాలని, ఈ సమస్య ఏ ఒక్కరిదో కాదని, ఇది సామాజిక అంశం అని, ప్రజలందరూ భాగస్వాములై గుర్తెరిగి అవగాహన కల్పించాలని కోరారు. జిల్లా ఆసుపత్రుల సమన్వయ కర్త డాక్టర్ చింత రమేశ్ మాట్లాడుతూ వైరస్‌తో జీవిస్తున్న ప్రజలకు వారికి మద్దతు మరియు సంఘీభావం అంధించాలని ప్రజలకు అవగాహన కల్పించాలని, మరియు పరీక్షలు, చికిత్సను ప్రోత్సహించాలని పేరుకొన్నారు. ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూఈ సంవత్సరం థీమ్ అంతరాయన్ని అధిగమించడం ఎయిడ్స్ ప్రతి స్పందనను మార్చడం అని తెలుపుతూ, జిల్లాలో ఇప్పటివరకు 9511 మందికి హెచ్ఐవియ పరీక్షలు నిర్వహించగ 43 మంధి కి హెచ్ఐవ్ని వున్నట్లు గుర్తించామని , 5228 మంది గర్భిణీ స్త్రీలను పరీక్షించగా 6 గురు హెచ్ఐవిచ వున్నట్లు గుర్తించమన్నారు. ముగ్గురు గర్భిణీ స్త్రీలకు సుఖ ప్రసవం చేయడం జరిగిందని తల్లి, బిడ్డలకు మందులు అందాయన్నారు. అనంతరం ఎయిడ్స్ డే సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన, వకృత్వా, రంగోలి పోటీలలో ని విజేతలకు నగదు బహుమతి, సర్టిఫికేట్లతో పాటు మెమోంటోలను అతిదుల ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమములో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ లక్ష్మినారాయణ, డాక్టర్ విజయ్, డాక్టర్ శ్రవణ్, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, ఎయిడ్స్ ప్రాజెక్టు సి యెస్ ఓ సారయ్య, సర్వోదయ యూత్ యన్ జి ఓ విహన్ స్వచ్ఛంద సంస్త ప్రతినిదులు ఆరోగ్య విద్యా బోదకులు కె వి రాజు, శారధ, డి పి యం ఓ లు యెల్లయ్య, వాల్య, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, టిబి ప్రోగ్రాం మేనేజర్ నీలిమ శ్వేత, అశోక్, వైద్యాధికారులు డాక్టర్ అర్జున్, మౌనిక, సురేశ్, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు, అద్యాపకులు, ఐసిటిసి కౌన్సిలర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

## ఉద్యోగ నోటిఫికేషన్స్ ఇవ్వాలని ఆందోళన

## అడ్డుకున్న పోలీసులు


## నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం

## ఏబిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మంద నరేష్




హనుమకొండ, డిసెంబర్ 01 (తీన్మార్ న్యూస్): తెలంగాణా రాష్ట్రములో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగాలను ఇస్తామని ప్రతి పక్ష హెూదాలో రేవంత్ రెడ్డి హామీ ఇవ్వడంతో తెలంగాణలో విద్యార్థి నిరుద్యోగ యువత వారి తల్లి దండ్రులు కాంగ్రెస్ పార్టీ నీ నమ్మి ఓట్లు వేస్తె తెలంగాణ రాష్ట్రములో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకీ వచ్చింది రాష్టానికి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యిండు ముఖ్యమంత్రి అయ్యి రెండు సంవత్సరాలు అవుతున్న కానీ ఇప్పటి వరకు రాష్ట్రములో ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా నిరుద్యోగులకు అన్యాయం చేయడాన్ని నిరసిస్తూ హన్మకొండ నయంనగర్ లో ఏభిఎస్ఎఫ్ సేవ లాల్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో భారీ ఆందోళన చేయడంతో హన్మకొండ పోలీసులు అడ్డుకోవడం జరిగింది. భారీగా ట్రాఫిక్ నిలియిపోయింది అనంతరం ఏభిఎస్ఎఫ్ అధ్యక్షులు మంద నరేష్ మాట్లాడుతూ నిరుద్యోగులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యోగనోటిఫికేషన్స్ ఇవ్వకుండా మోసం చేయడం జరిగిందనీ అన్నారు ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించి నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలనీ అన్నారు లేకపోతే మాత్రం జిల్లాలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతాం అని మంద నరేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏభిఎస్ఎఫ్ నాయకులు మోహన్ భరత్ కిరణ్ నవ్య సాయి ప్రవళిక అంజలి పాల్గొన్నారు.

# ప్రాంప్ట్ ఇంజెక్షన్ గండం



హైదరాబాద్, డిసెంబర్ 01 (తీన్మార్ న్యూస్): ఏఐకి 'మాటల' మాయ కంపెనీల డేటాకు 'ప్రాంప్ట్' గండం అంటూ సోమవారం ఎక్స్ వేదికగా హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆసక్తికర పోస్ట్ నెటిజన్‌లతో పంచుకున్నారు. సరైన భద్రతా చర్యలు తీసుకోకపోతే సంస్థల కార్యకలాపాలు స్తంభించిపోవడంతో పాటు, విలువైన డేటా నేరగాళ్ల చేతికి చిక్కి కోలుకోలేని దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కృత్రిమ మేధ విస్తృతి పెరిగాక చిన్న స్టార్టప్‌ల నుంచి బడా మల్టీ నేషనల్ కంపెనీల వరకు అంతా ఇప్పుడు ఏఐ చాట్‌బోట్‌ల జపం చేస్తున్నాయి. కస్టమర్ల సందేహాలకు క్షణాల్లో సమాధానాలివ్వడం, పని వేగం పెంచడం, ఖర్చు తగ్గించడం వంటి ప్రయోజనాలు ఉండటంతో సంస్థలు వీటిపై ఎక్కువగా ఆధారపడుతున్నాయి. అయితే, ఈ సాంకేతికత వెనుక ఓ సరికొత్త ముప్పు పొంచి ఉంది. అదే 'ప్రాంప్ట్ ఇంజెక్షన్'.

### అసలేంటీ 'ప్రాంప్ట్ ఇంజెక్షన్'?

సాధారణంగా ఏఐ పని చేయడానికి మనం ఇచ్చే ఆదేశాలను 'ప్రాంప్ట్' అంటారు. సైబర్ నేరగాళ్లు ఈ ప్రాంప్ట్‌లనే ఆయుధంగా మలుచుకుంటున్నారు. ఏఐ మోడల్‌ను తప్పుదోవ పట్టించేలా, ట్రిక్ చేసేలా 'మలీషియస్ ప్రాంప్ట్స్' (కీడు చేసే ఆదేశాలు) ఇస్తున్నారు. క్లుప్తంగా చెప్పాలంటే "ఏఐని మాటలతో మాయ చేయడం". ఇలా ఏఐని కన్ఫ్యూజ్ చేసి, సాధారణంగా బయటపెట్టకూడని సంస్థల అంతర్గత పత్రాలు, కస్టమర్ల రికార్డులు, సిస్టమ్ వివరాలను రాబట్టడమే 'ప్రాంప్ట్ ఇంజెక్షన్ అటాక్'.

### డేటా భద్రతకు పెను సవాల్

ప్రస్తుతం చాలా సంస్థలు తమ ఏఐ మోడల్స్, చాట్‌బోట్‌లను సంస్థలోని కీలకమైన డేటా సిస్టమ్‌లకు (సీఆర్ఎం డేటా, హెల్ప్‌డెస్క్ టికెట్లు, ఉద్యోగుల సమాచారం, ఫైనాన్షియల్ రికార్డులు) అనుసంధానిస్తున్నాయి. ఎండ్ యూజర్‌కు ఈ సమాచారం పొరపాటున కూడా కనిపించకూడదు. కానీ, హ్యాకర్లు వేసే ఒకే ఒక్క 'ట్రిక్కీ ప్రాంప్ట్' వల్ల ఈ గోప్య సమాచారమంతా బయట పడే ప్రమాదం ఉంది.

### గార్డ్‌రెయిల్స్ తోనే రక్షణ

ఈ ముప్పును పసిగట్టి, నివారించడానికి సంస్థలు తక్షణమే ప్రాంప్ట్ గార్డ్‌రెయిల్స్ (రక్షణ కవచాలు) ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది. కేవలం ఒక అంచె భద్రత సరిపోదు, మల్టీ-లేయర్ డిఫెన్స్ విధానాన్ని పాటించాలి.

### జాగ్రత్తలివే!

మోడల్-లెవల్ సెక్యూరిటీ: ఏఐకి సేఫ్టీ ట్రైనింగ్ ఇవ్వడం, కఠినమైన నిబంధనలు విధించడం ద్వారా అనవసర సమాచారాన్ని ఇవ్వకుండా నియంత్రించాలి.

ప్రాంప్ట్-లెవల్ సెక్యూరిటీ: హానికరమైన ప్రాంప్ట్‌లను గుర్తించే వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి.

సిస్టమ్-లెవల్ సెక్యూరిటీ: ఏఐకి యాక్సెస్ ఇచ్చే డేటా, ఏపీఐలపై కఠిన నియంత్రణలు ఉండాలి.

ఆడిట్స్ & యాక్సెస్: ఎప్పటికప్పుడు సెక్యూరిటీ ఆడిట్స్ నిర్వహిస్తూ డేటా యాక్సెస్‌ను పరిమితం చేయాలి.

# నిర్ణీత గడువులోపు అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

## అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలన

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్




తాడ్వాయి, డిసెంబర్ 01 (తీన్మార్ న్యూస్): శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర అభివృద్ధి పనులు నిర్ణీత గడువులోపు శరవేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్, ఆర్డీవో వెంకటేష్ తో కలసి శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ విఐపి, వివిఐపి పార్కింగ్ స్థలాలను రహదారులను, గద్దెల ప్రాంగణ అభివృద్ధి పనులు, రెడ్డిగూడెం అంతర్గత రహదారులను వాటి పనుల పురోగతిని ఆర్డీవో వెంకటేష్ ను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత గడువులోపు పనులను పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈ ఈ అజయ్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు

# ఐల్ట్స్ కోసం ఉచిత శిక్షణ

మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 01 (తీన్మార్ న్యూస్): బీసి స్టడీ సర్కిల్స్ ద్వారా ఐల్ట్స్ (ఐ.ఈ.ఎల్.టీఎస్) (ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టెస్టింగ్) విదేశాలలో వున్న అత్యున్నత విశ్వవిధ్యాలయాలలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఇవ్వబడుతున్న అంతర్జాతీయ స్కాలర్ షిప్పులు పొందడం లక్ష్యంగా నిర్మాణాత్మక అవగాహన సెషన్లు, ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్ ఇన్చార్జి డైరెక్టర్ ఎం. నర్సింహస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. పైన తెలుపబడిన అవగహన కార్యక్రమాలకు మరియు ఐల్ట్స్ శిక్షణ తరగతులుకు హాజరు అవ్వుటకు ఆసక్తి వున్న గ్రాడ్యుయేషన్ (ప్రొఫెషనల్ మరియు నాన్ ప్రొఫెషనల్) ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులు తేది 01.12.2025 నుండి 21.12.2025 వరకు టి. జి. బి. సి స్టడీ సర్కిల్ వెబ్ సైట్ %షష్.స్త్రఏఠరబఎఎఠఅతీఎశ్రీవ.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.ఱఅ% ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 0870-2571192, 040-24071178 నెంబరును సంప్రదించాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి.శ్రీనివాస రావు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# కేయు ఎన్ఎస్ఎస్ యూనిట్ అడ్వెంచర్ క్యాంపు విజయవంతం




హనుమకొండ కేయు, డిసెంబర్ 01 (తీన్మార్ న్యూస్): కాకతీయ విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగానికి చెందిన నేషనల్ సర్వీస్ స్కీమ్ వాలంటీర్ జయశీల రూపాని, హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాల వద్ద ఉన్న అటల్ బిహారి వాజపేయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటనీరింగ్ అండ్ అల్లైడ్ స్పోర్ట్స్ నిర్వహించిన 10-రోజుల అడ్వెంచర్ క్యాంపు (నవంబర్ 18%-%27) లో విజయవంతంగా పాల్గొన్నారు. ఈ శిక్షణా శిబిరంలో ఆమె నేచురల్ రాక్ క్లైంబింగ్, ఆర్టిఫిషియల్ మౌంటెన్ క్లైంబింగ్, ట్రెక్కింగ్, మౌంటెన్ క్లైంబింగ్, మౌంటెన్ రేపెల్లింగ్, రివర్ క్రాసింగ్ తదితర సాహస క్రీడల్లో ప్రతిభ కనబరిచారు. ఈ విజయంపై విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం జయశీల రూపానిని అభినందించారు.

# నాలుగో బెటాలియన్లో ఘనంగా పదవీ విరమణ కార్యక్రమం



మామునూరు, డిసెంబర్ 01 (తీన్మార్ న్యూస్): వరంగల్ జిల్లా మామనూర్ నాలుగు బెటాలియన్ లో ఎం.డి సర్వర్ ఏఆర్ఎస్ఐగా విధులు నిర్వర్తించి పదవీ విరమణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిధిగా కమాండెంట్ డి. శివప్రసాద్ రెడ్డి హాజరు అయ్యి పదవీ విరమణ పొందుతున్న ఏఆర్ఎస్ఐ ఎం.డి సర్వర్ కి శాలువ కప్పి సన్మానించారు. సుధీర్ఘ కాలం 42 సంవత్సరాలు పోలీసు శాఖలో విధులు నిర్వర్తించి తన సర్వీస్ లో ఎలాంటి రిమార్క్స్ లేకుండా పదవీ విరమణ పొదుతున్నారు. పదవీ విరమణ తర్వాత తన కుటుంబంతో సంతోషంగా ఆయురారోగ్యాలతో ఉండాలని తెలపడం జరిగింది. వారికి రావాల్సిన సిసిఎస్ నగదు మొత్తాన్ని చెక్కు రూపంలో అందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ కృష్ణప్రసాద్, వీరన్న, రిజర్వు ఇన్స్పెక్టర్స్ విజయ్,కార్తీక్,రవి, సర్వర్, వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్ అధికారులు మరియు బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

# డిజిటల్ అరెస్ట్‌లపై "సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం"




న్యూ ఢిల్లీ, డిసెంబర్ 01 (తీన్మార్ న్యూస్): దేశంలో పెరిగిపోతున్న డిజిటల్ అరెస్టుల మోసాలపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. డిజిటల్ అరెస్టు మోసాలపై దేశవ్యాప్తంగా సీబీఐ విచారణకు సుప్రీంకోర్టు సోమవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సీబీఐ విచారణకు అవసరమైన అనుమతి, సమాచారం ఇచ్చి సహకరించాలని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలైన తెలంగాణ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్ణాటక, సహా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సూచించింది. తమ వద్ద నమోదైన ఎఫ్ఐఆర్ వివరాలు సీబీఐకి అందిచాలని తెలిపింది. డిజిటల్ అరెస్టుల అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా విచారిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ పిల్ పై సోమవారం విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చి నేతృత్వంలోని బెంచ్ డిజిటల్ అరెస్ట్ మోసాలపై దర్యాప్తు చేపట్టాలని సీబీఐని ఆదేశించింది.

**ఆ పని ఎందుకు చేయడం లేదు ఆర్బీఐ కి నోటీసులు:**

ఇండియాకు సైతం నోటీసులు జారీ చేసిన సుప్రీంకోర్టు ఈ సందర్భంగా కీలక ప్రశ్నలు సంధించింది. సైబర్ మోసాలకు ఉపయోగించిన బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేయడంలో ఏఐ, మెషిన్ లెర్నింగ్ వంటి టెక్నాలజీని ఎందుకు వినియోగించడం లేదని ప్రశ్నించింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ జోక్యం చేసుకుని వివరాలు అందించాలని, డిజిటల్ అరెస్ట్ కేసుల్లో సీబీఐ దర్యాప్తునకు సహకరించడంతో పాటు పౌరులను మోసం చేయడంలో సహకారం అందించిన బ్యాంకు అధికారులను సైతం గుర్తించాలని సీబీఐకి సూచించింది. దుర్వినియోగం అరికట్టేందుకు ఒక వ్యక్తికి అనేక సిమ్ లు కేటాయించకుండా టెలికాం ఆపరేటర్లు ఆదేశాలు ఇవ్వాలని టెలికాం మంత్రిత్వ శాఖను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆన్ లైన్ ఫ్రాడ్స్ అడ్డుకునేదుకు సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. దీనిపై కేంద్ర హోం, టెలికాం, ఆర్థిక సహా పలు శాఖల స్పందన తెలియజేయాలని సొలిసిటర్ జనరల్ ను ఆదేశించింది. ఇక విదేశాల్లో ఉంటూ మోసాలకు పాల్పడుతున్న నేరస్థులను పట్టుకునేందుకు ఇంటర్ పోల్ సాయం తీసుకోవాలని సీబీఐకి సూచించింది. ప్రజలను మోసం చేసే ఖాతాలను ఫ్రీజ్ చేసేలా సీబీఐతో పాటు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని పోలీసు దర్యాప్తు సంస్థలకు స్వేచ్ఛ ఇవ్వాలని సూచించింది.

**తెలంగాణలో సీబీఐకి నో ఎంట్రీ:**

తెలంగాణ రాష్ట్రంలో నేరుగా సీబీఐ వచ్చి దర్యాప్తు చేపట్టేందుకు ఇక్కడ అనుమతి లేదు. సీబీఐ ఎంట్రీ కోసం జనరల్ కన్సెంట్ ను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. దాంతో సీబీఐ రాష్ట్రంలో అడుగుపెట్టాలంటే రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తప్పని చేసింది. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కాళేశ్వరంపై విచారణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం సీబీఐని కోరింది. తాజాగా డిజిటల్ అరెస్టుల విషయంలో తెలంగాణ సహా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు సహకరించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

# మరోసారి భారీగా బ్యాంకుల విలీనం

న్యూ ఢిల్లీ, డిసెంబర్ 01 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వ రంగ బ్యాంకులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం మరోసారి భారీ విలీన ప్రక్రియను చేపట్టాలని భావిస్తోంది. 2026-27 ఆర్థిక సంవత్సరంలోనే దీన్ని నిర్వహించాలని, ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం రంగ బ్యాంకులను 12 నుంచి నాలుగింటికి తగ్గించాలని చూస్తోంది. ఇదే గనక పూర్తయితే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ), బ్యాంక్ ఆఫ్ బరోడా(బీఓబీ), కెనరా-యూనియన్ బ్యాంకుల విలీనం ద్వారా కొత్త బ్యాంకు ఏర్పాటు కానుంది. ఇదివరకు 2020లో కేంద్ర ప్రభుత్వం 27 బ్యాంకులను విలీనం ద్వారా 12కు తగ్గించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం నాలుగింటికి తగ్గించే ప్రతిపాదన ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలో ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయని మనీకంట్రోల్ తన కథనంలో పేర్కొంది. బ్యాలెన్స్ షీట్‌లను మరింత పటిష్టం చేయడం, కార్యకలాపాల సామర్థ్యాన్ని మెరుగుపరచడం, అంతర్జాతీయ బ్యాంకుల స్థాయిలో వీటిని పోటీ పడేలా సిద్ధం చేయడం వంటి చర్యలపై మంత్రిత్వ శాఖ పనిచేస్తున్నది. ప్రస్తుత 12 బ్యాంకుల సంఖ్యను నాలుగుకు తగ్గించడం ప్రభుత్వ ప్రణాళికగా ఉంది. ఆ తర్వాత చిన్న బ్యాంకులను ముందుగా పెద్ద బ్యాంకులలో విలీనం చేసి, ఆపై దేశ వృద్ధి అవసరాలకు మద్దతు ఇవ్వగల పెద్ద బ్యాంకులుగా మార్చనున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి.

**కెనరా-యూనియన్ బ్యాంకుల విలీనం**

కేంద్రం కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలను విలీనం చేయాలని చూస్తోంది. ఇది నాలుగు అతిపెద్ద పీఎస్‌బీల ఒకటిగా ఏర్పడుతుంది. ఇండియన్ బ్యాంక్, యూకో బ్యాంక్‌లను కూడా ఏదోక పెద్ద బ్యాంకులో విలీనం చేయడంపై పరిశీలిస్తున్నారు. దీని వల్ల ఎస్‌బీఐ, పీఎన్‌బీ, బీఓబీలు మిగిలిన ప్రధాన బ్యాంకులుగా మారనున్నాయి. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలను కూడా విలీనం చేయనున్నారు.

# మహిళా శక్తికి ఆర్టీసీ బలం

మొదటి పేజీ తరువాయి



రాశారు. మహిళా సమాఖ్యల ద్వారా నిర్వహించేందుకు వీలుగా మరో 448 అద్దె బస్సుల కొనుగోలుకు సిద్ధంగా ఉన్నట్లు ఆమె ఆ లేఖలో పేర్కొన్నారు. అవసరమైన ప్రభుత్వ అనుమతులు మంజూరైన వెంటనే, ఈ కొత్త బస్సులను ఆర్టీసీకి అప్పగిస్తామని ఆమె వెల్లడించారు. మహిళలకు స్థిరమైన ఆదాయ మార్గాలను కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా ఈ కార్యక్రమం జరుగుతోంది. కొత్త బస్సులు అందుబాటులోకి వస్తే, ఆర్టీసీలో మహిళా సమాఖ్యల ద్వారా నడిచే బస్సుల సంఖ్య గణనీయంగా పెరగనుంది. ప్రస్తుతానికి రాష్ట్ర వ్యాప్తంగా మహిళా సమాఖ్యల ద్వారా 152 ఆర్టీసీ బస్సులు విజయవంతంగా నడుస్తున్నాయి. సెర్ప్ ద్వారా అదనంగా 448 బస్సులు చేరితే, మహిళా సమాఖ్యలు నిర్వహించే మొత్తం బస్సుల సంఖ్య 600కు చేరుకుంటుంది. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు మహిళా సంఘాలకు పెద్ద ఊరటగా మారనున్నాయి. ఆర్టీసీ ద్వారా ఉపాధి పొందే మహిళల సంఖ్య, రాష్ట్రంలో మహిళా శక్తి ద్వారా మౌలిక సదుపాయాల నిర్వహణ విస్తృతి ఈ నిర్ణయం ద్వారా మరింత పెరగనుంది.

# మావోయిస్ట్ అగ్రనేత దేవ్‌జీపై ఉత్కంఠ

## సీఎం రేవంత్, పవన్‌కు కుటుంబసభ్యురాలి లేఖ
## పోలీస్ కస్టడీ వార్తలపై స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి



తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 01 (తీన్మార్ న్యూస్): మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ పోలీసుల అదుపులో ఉన్నాడని గతకొన్ని రోజులుగా వార్తలు వైరల్ అయిన విషయం తెలిసిందే. తిప్పిరి తిరుపతిని ఎన్‌కౌంటర్ చేయబోతున్నారని పౌర హక్కుల సంఘం నేతలు సైతం పదే పదే ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు తిప్పిరి తిరుపతి తమ్ముడి కూతురు సుమ లేఖ రాసింది. దీనిని సోషల్ మీడియా వేదికగా పోస్టు చేసింది. నా పెదనాన్న తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్జీ, మావోయిస్టు పార్టీ చీఫ్‌గా ఉన్నారు. ఇటీవల ఆయన పోలీసుల కస్టడీలో ఉన్నారనే వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ వార్తలు నిజమా.. కాదా.. అనేది మా కుటుంబానికి స్పష్టంగా తెలియడం లేదు. కానీ ప్రతిరోజూ వినిపించే ఈ సమాచారం మా కుటుంబాన్ని తీవ్ర కలిచివేతకు గురిచేస్తోంది. ఒకవేళ ఈ వార్తలు నిజమే అయితే, దయచేసి ఆయనను కోర్టులో హాజరుపరచేలా చూడాలని లేదా లొంగిపోవడానికి అవకాశం ఇవ్వాలని మా కుటుంబం తరపున మనస్ఫూర్తిగా మిమ్మల్ని వేడుకుంటున్నాను. గత 40 ఏళుగా మా కుటుంబం ఆయన కోసం ఎదురు చూడని రోజు లేదండి ఆయన కోసం వేచిచూస్తున్న సమయాన్ని మాటల్లో చెప్పలేం. న్యాయం కోసం నిజమైన నాయకులు ముందుండే వారు మీరు అని నమ్మే ఒక పౌరురాలిగా, మీ స్పందన కోసం ఎదురు చూస్తున్నాను సార్. మేము తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోరుట్ల పట్టణానికి చెంది ఉన్నందున, మా పెదనాన్న పరిస్థితిపై మీరు దయచేసి స్పందించి సహాయం చేయాలి అని వినమ్రంగా కోరుకుంటున్నాను, మా కుటుంబానికి మీరు తప్పకుండా న్యాయం చేస్తారని మనస్ఫూర్తిగా విశ్వసిస్తున్నాం. ఈ ట్వీట్ మీవరకు చేరుతుందని, మీరు సానుకూలంగా స్పందిస్తారనే ఆశతో ఎదురు చూస్తున్నాం సార్ అని లేఖలో పేర్కొన్నారు.

# వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్ పై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

## గడువు పొడిగింపు డిమాండ్‌ను కోర్టు తిరస్కరణ
## దరఖాస్తుదారులు వక్ఫ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాలని సూచన




న్యూ ఢిల్లీ, డిసెంబర్ 01 (తీన్మార్ న్యూస్): గత పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ (సవరణ) చట్టం 2025 ను ఆమోదించిన విషయం తెలిసిందే. ఈ వక్ఫ్ సరవరణ చట్టం ప్రకారం వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం ఆరు నెలల గడువు నిర్ణయించారు. అయితే ఈ గడువును పొడిగించాలంటూ సుప్రీంకోర్టులో అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిపై రోజు విచారించిన కోర్టు వారి వాదనను తోసిపుచ్చింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్ నేతృత్వంలోని ధర్మాసనం, దరఖాస్తుదారులు తమ రిలీఫ్ కోసం 2025 చట్టం ప్రకారం నేరుగా వక్ఫ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాలని సూచించింది. ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ డిసెంబర్ 6 అని తమకు సమాచారం అందిందని ధర్మాసనం పేర్కొంది. దరఖాస్తుదారులు ట్రిబ్యునల్‌కు వెళ్లడం ద్వారా రిలీఫ్ పొందవచ్చని, ఆరు నెలల గడువును పొడిగించుకోవచ్చని స్పష్టం చేసింది. దరఖాస్తుదారుల తరఫు న్యాయవాదులు, ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం ఉద్దేశించిన '%ఖవీజుజుణ%' పోర్టల్‌లో నమోదు ప్రక్రియతో పాటు, డిజిటలైజేషన్‌లో కూడా సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని కోర్టుకు తెలిపారు. ఈ సాంకేతిక సమస్యలపై ట్రిబ్యునల్ విచారణ జరిపే సమయానికి, డిసెంబర్ 6 గడువు ముగుస్తుందని వారు వాదించారు. అయినప్పటికీ, సుప్రీంకోర్టు ఈ వాదనను అంగీకరించకుండా, పోర్టల్‌లో నమోదు చేయడంలో నిజమైన ఇబ్బందులు ఎదుర్కొనే ఏ దరఖాస్తుదారుడైనా ట్రిబ్యునల్ వద్ద గడువు పొడిగింపును కోరవచ్చని పునరుద్ఘాటించింది. ఒకవేళ సాంకేతిక కారణాల వల్ల రిజిస్ట్రేషన్ నిలిచిపోయినా, ట్రిబ్యునల్ గడువును అనుమతిస్తే, వారికి ఆరు నెలల సమయం లెక్కించబడుతుందని న్యాయస్థానం స్పష్టం చేసింది.

# మేడారం జాతర ఏర్పాట్లపై సీఎం రేవంత్ సమీక్ష

## గ్రాండ్ లుక్, నాణ్యతకు పెద్దపీట వేయాలని ఆదేశం
## జనవరి 28 నుంచి 31 వరకు జరగనున్న జాతర
## దేశం నలుమూలల నుంచి లక్షల్లో తరలిరానున్న భక్తులు



హైదరాబాద్, డిసెంబర్ 01 (తీన్మార్ న్యూస్): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మేడారం సమ్మక్క సారలమ్మ వన దేవతల మహా జాతర తేదీలు ఇప్పటికే ఖరారైన విషయం తెలిసిందే. మేడారం మహా జాతర 2026, జనవరి 28 నుంచి 31 వరకు జాతర జరుగనుంది. ఈ క్రమంలోనే దేశ వ్యాప్తంగా జాతరకు లక్షల్లో భక్తులు తరలి రానున్న క్రమంలోనే చేపట్టిన అభివృద్ధి పనులు, మౌలిక సదపాయాలపై సోమవారం జూబ్లీహిల్స్‌లో తన నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, సీఎంవో ముఖ్య కార్యదర్శి శ్రీనివాస రాజు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మేడారంలో నిర్మాణ పనులపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ సమ్మక్క, సారలమ్మ గద్దెల దగ్గరలో ఉన్న చెట్లను తొలగించవద్దని సూచించారు. పనుల నాణ్యతలో ఏమాత్రం రాజీ పడొద్దని తెలిపారు. నిర్మాణంలో చిన్న విమర్శలకు కూడా తావు ఇవ్వొద్దని తెలిపారు. గద్దెల సమీపంలో వరద నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలి, అక్కడే నాలుగు వైపులా ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సమ్మక్క సారాలమ్మ గద్దెల ప్రాంగణం గ్రాండ్ లుక్ వచ్చేలా లైటింగ్ ఏర్పాట్లు ప్రధాన ఆలయం చుట్టూ పచ్చదనం అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# AI కమాండ్ సెంటర్‌గా మారనున్న హైదరాబాద్

## కోవాసెంట్ AI ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభం
## ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, డిసెంబర్ 01 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ ఇకపై కేవలం టెక్నాలజీ హబ్‌గా మాత్రమే కాకుండా భద్రమైన, బాధ్యతాయుతమైన ఏఐ భవిష్యత్తును నిర్మించే కేంద్రంగా మారుతోందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. హైదరాబాద్ రాబోయే రోజుల్లో ఏఐ కమాండ్ సెంటర్గా, ప్రపంచ ఉత్పత్తులు రూపొందే స్థలంగా మారబోతోందన్నారు. సోమవారం హైదరాబాద్‌లో కోవాసెంట్ కొత్త ఏఐ ఇన్నోవేషన్ సెంటర్ ను మంత్రి ప్రారంభించారు. 500 మంది ఏఐ ఇంజనీర్ల సామర్థ్యంతో రూపొందించబడిన ఈ సెంటర్ 2028 నాటికి 3000 మంది ఏఐ ఇంజనీర్లకు వేగంగా విస్తరించేందుకు కంపెనీ ప్రణాళికలు వేస్తోంది. ఈ సందర్భంగా మాట్లాడిన శ్రీధర్ బాబు ప్రపంచవ్యాప్తంగా నగరాలు కృత్రిమ మేధస్సు యుగాన్ని నడిపేందుకు పోటీ పడుతున్నాయని చెప్పారు. అయితే హైదరాబాద్ మాత్రం భిన్నమైన మార్గాన్ని ఎంచుకుందని ఇక్కడ మేము లోతైన సామర్థ్యం, దీర్ఘకాల దృష్టిపై ఆధారపడి నాయకత్వాన్ని నిర్మిస్తున్నామన్నారు. రాబోయే సంవత్సరంలో అడ్వాన్స్డ్ ఇంజనీరింగ్ సెంటర్ల పెరుగుదలతో పాటు ఏఐ మరియు సైబర్ సెక్యూరిటీలో ప్రత్యేక పాత్రలు విస్తరిస్తాయని చెప్పారు. కోవాసెంట్ ఏఐ ఇన్నోవేషన్ సెంటర్ ఈ వేగాన్ని మరింత బలోపేతం చేస్తుందని చెప్పారు. తద్వారా గవర్నెన్స్, సైబర్ సెక్యూరిటీ మరియు ఎంటర్ప్రైజ్ స్థాయి ఏఐ డెవలప్మెంట్‌ను ఒకే ఎకోసిస్టమ్ లోకి తీసుకొస్తుందన్నారు.

# దేశంలోనే 7వ ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా శామీర్‌పేట




తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 01 (తీన్మార్ న్యూస్): దేశ వ్యాప్తంగా మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ ఎంపిక చేసిన ఉత్తమ పోలీస్ స్టేషన్లలో శామీర్‌పేట పోలీస్ స్టేషన్ ఏడో స్థానాన్ని, తెలంగాణలో మొదటి స్థానాన్ని సాధించింది. పోలీస్ స్టేషన్ పనితీరు, రికార్డుల నిర్వహణ, బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం, ఫిర్యాదులకు సమయానుకూల పరిష్కారం చూపించడం వంటి అంశాలను ఎమ్‌హెచ్‌ఏ పరిగణనలోకి తీసుకుంది. అలాగే స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, గార్డెనింగ్, ఉత్తమ సీసీటీఎన్ఎస్ పని సిబ్బంది నైపుణ్యం వంటి అంశాలు కూడా పరిశీలనలో ఉన్నాయి. ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా 10 ఉత్తమ పోలీస్ స్టేషన్లను ఎంపిక చేసే ఈ ప్రక్రియలో, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన శామీర్పేట్ పోలీస్ స్టేషన్ రాష్ట్రంలో అగ్రస్థానాన్ని, దేశంలో ప్రతిష్టాత్మకమైన ఏడో ర్యాంకును సాధించడం విశేషం.

# మీ పిల్లలకు ఈ ఆహారాలను రోజూ పెట్టండి..

## ఇవి బ్రెయిన్ ఫుడ్స్.. వారి తెలివితేటలను పెంచుతాయి..!

ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ ఎంతటి తీవ్రమైన పోటీ నెలకొందో అందరికీ తెలిసిన విషయమే. ముఖ్యంగా విద్య, ఉద్యోగ రంగాల్లో కొన్ని కోట్ల మంది ఒకరితో ఒకరు పోటీ పడుతున్నారు. ఈ క్రమంలో ఈ పోటీ ప్రపంచంలో నెగ్గాలంటే ప్రతి ఒక్కరికి అద్భుతమైన నైపుణ్యాలు ఉండాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. స్కిల్స్ ఉంటే కానీ ఈ పోటీ ప్రపంచంలో నెట్టుకు రాలేకపోతున్నారు. అయితే ఒక మనిషికి స్కిల్స్ ఉండాలంటే అప్పటికప్పుడు అభివృద్ధి చెందడం కష్టం. వాటిని చిన్నప్పటి నుంచే వృద్ధి చేసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే ఈ విషయంలో తల్లిదండ్రులు ముఖ్య పాత్ర పోషించాల్సి ఉంటుంది. తల్లిదండ్రులు తమ పిల్లలు పెద్దయ్యాక ఎలాంటి స్కిల్‌ను అయినా సులభంగా నేర్చుకోవాలన్నా, అందరిలోనూ సులభంగా నెగ్గాలన్నా వారికి తెలివితేటలు వృద్ధి చెందేలా చూడాలి. అందుకు గాను పలు ఆహారాలు ఎంతో దోహదం చేస్తాయి. పిల్లలకు తల్లిదండ్రులు ఆ వయస్సు నుంచే రోజూ పలు ఆహారాలను పెడుతుండాలి. దీని వల్ల వారిలో మెదడు పనితీరు మెరుగు పడుతుంది. జ్ఞాపకశక్తి వృద్ధి చెంది తెలివితేటలు పెరుగుతాయి. చదువుల్లో రాణిస్తారు. పెద్దయ్యాక కూడా అన్నింట్లోనూ, అందరికన్నా ముందే ఉంటారు.




### చేపలు, కోడిగుడ్లు..

పిల్లల మెదడు అభివృద్ధి చెందేలా చూడడంలో చేపలు ఎంతో దోహదం చేస్తాయి. చేపలను వారికి తరచూ పెట్టడం వల్ల వారి మెదడు వికసిస్తుంది. తెలివితేటలు వృద్ధి చెందుతాయి. పిల్లల మెదడుకు పదును పెట్టేందుకు చేపలు ఎంతగానో దోహదం చేస్తాయి. ముఖ్యంగా మంచినీటి లేదా సముద్రపు చేపలను వారికి తినిపించాలి. వీటిల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి పిల్లల మెదడు పనితీరును మెరుగు పరచడంలో ఎంతో సహాయం చేస్తాయి. దీని వల్ల వారి మెదడు యాక్టివ్‌గా మారి ఉత్సాహంగా ఉంటారు. అన్నింట్లోనూ తెలివితేటలను కనబరుస్తారు. అలాగే పెద్దయ్యాక కూడా మిక్కిలి ప్రతిభావంతులుగా మారుతారు. ఇక పిల్లల తెలివితేటలు పెరగాలంటే వారికి రోజూ ఒక కోడిగుడ్డును ఉడకబెట్టి తినిపించినా ఎంతో మేలు జరుగుతుంది. కోడిగుడ్లలో అనేక పోషకాలు ఉంటాయి. ముఖ్యంగా ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, కోలిన్, లుటీన్, జింక్ వంటి పోషకాలు గుడ్లలో ఉంటాయి. ఇవి పిల్లల్లో యాక్టివ్‌నెస్‌ను పెంచుతాయి. బద్ధకం పోయేలా చేస్తాయి. దీంతో వారి మెదడు వికసిస్తుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. చదువుతోపాటు ఇతర అంశాల్లోనూ రాణిస్తారు. పెద్దయ్యాక ఉన్నత శిఖరాలకు చేరుకుంటారు.

### పెరుగు..

పిల్లల మెదడు అభివృద్ధికి పెరుగు సైతం దోహదం చేస్తుంది. పెరుగును రోజూ వారికి తినిపించాలి. ఇది మెదడు కణాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. దీని వల్ల మెదడుకు అలర్ట్‌నెస్ పెరుగుతుంది. దీంతో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరిగి చిన్నారులు ఏ విషయాన్నయినా ఇట్టే నేర్చుకుంటారు. అలాగే చిన్నారులకు పాలకూర, అరటికాయలు, బ్రోకలీ, ఆకుకూరలు వంటి వాటిని కూడా పెడుతుండాలి. ముఖ్యంగా టమాటాలు, బ్లూ బెర్రీలు, బ్లాక్ బెర్రీల వంటి వాటిని వారికి తినిపిస్తుండాలి. వీటిల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి మెదడు కణాలను రక్షిస్తాయి. దీంతో మెదడు యాక్టివ్‌గా మారి వారు చదువుల్లో రాణిస్తారు. ఇక పిల్లల ఆరోగ్యం కోసం తృణ ధాన్యాలను కూడా వారికి ఇవ్వాల్సి ఉంటుంది. ఓట్స్, బ్రౌన్ రైస్, కినోవా వంటి ఆహారాలను పెడుతుంటే వారికి నిరంతరం శక్తి లభిస్తుంది. దీని కారణంగా వారు ఎల్లప్పుడూ యాక్టివ్‌గా ఉంటారు. నీరసం, అలసట రావు. బద్ధకం పోతుంది. వారు అన్నింట్లోనూ చురుగ్గా ఉంటారు. ప్రతిభ కనబరుస్తారు.

### విటమిన్ ఇ..

పిల్లల మెదడు ఆరోగ్యానికి విటమిన్ ఇ కూడా దోహదం చేస్తుంది. ఇది ఎక్కువగా బాదంపప్పు, జీడిపప్పు, వాల్ నట్స్, పిస్తా, గుమ్మడి విత్తనాలు, పొద్దు తిరుగుడు విత్తనాలు, చియా సీడ్స్, అవిసె గింజలు వంటి వాటిల్లో లభిస్తుంది. కనుక వీటిని పిల్లలకు పెడుతుంటే ఉపయోగం ఉంటుంది. అయితే వీటిని నేరుగా తినిపించకూడదు. నీటిలో నానబెట్టి తినిపించాలి. లేదంటే ఇవి పిల్లల్లో వికారం, వాంతులను కలగజేసే అవకాశం ఉంటుంది. అయితే న్యూట్రిషనిస్టు లేదా డాక్టర్‌ను కలిసి వీటిని పిల్లలకు తినిపిస్తే మంచిది. ఎందుకంటే కొందరికి పలు ఆహారాల వల్ల అలర్జీలు సంభవించే ప్రమాదం ఉంటుంది. కనుక మీ పిల్లలకు ఎలాంటి ఫుడ్స్ పడతాయి అనే విషయాన్ని తెలుసుకుని ఆ ప్రకారం వారికి ఆహారాలను పెడితే దీంతో వారి మెదడు యాక్టివ్‌గా మారి వారి తెలివితేటలు పెరుగుతాయి. దీని వల్ల వారు అన్నింట్లోనూ రాణిస్తారు.

# అధిక బరువు తగ్గాలని చూస్తున్నారా..? అయితే పాలను రోజూ ఏ సమయంలో తాగితే మంచిదో తెలుసుకోండి..!



మనం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ పాలను తాగితే మేలు జరుగుతుందని పోషకాహార నిపుణులు, వైద్యులు సూచిస్తుంటారు. పాలను సంపూర్ణ పౌష్టికాహారంగా చెబుతారు. ఎందుకంటే పాలలో మన శరీరానికి కావల్సిన దాదాపు అన్ని పోషకాలు ఉంటాయి. కనుకనే పాలను రోజూ తాగాలని సూచిస్తుంటారు. పాలలో అనేక పోషకాలు ఉంటాయి. రోజూ పాలను తాగడం వల్ల మన శరీరానికి కావల్సిన అన్ని పోషకాలను పొందవచ్చు. పాలలో ప్రోటీన్లు కూడా అధిక మొత్తంలోనే ఉంటాయి. ఒక కప్పు పాలను తాగడం వల్ల సుమారుగా 8 గ్రాముల ప్రోటీన్లు లభిస్తాయి. ప్రోటీన్లు మన శరీరానికి శక్తిని అందిస్తాయి. ఉత్సాహంగా, చురుగ్గా ఉండేలా చేస్తాయి. నీరసం, అలసటను తగ్గిస్తాయి. బద్ధకం పోయేలా చేస్తాయి. కనుక పాలను రోజూ తాగడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

### ఉదయం పాలను తాగితే..

శారీరక శ్రమ లేదా వ్యాయామం చేసిన వారు పాలను తాగితే శక్తి లభిస్తుంది. దీంతో మళ్లీ ఉత్సాహంగా పనిచేస్తారు. చురుగ్గా ఉంటారు. కండరాలు మరమ్మత్తులకు గురవుతాయి. కండరాల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. పాలను ఉదయం పూట తాగితే రోజంతా శక్తి స్థాయిలు శరీరంలో అధికంగా ఉంటాయి. దీంతో నీరసం, అలసట రావు. యాక్టివ్‌గా ఉంటారు. అలాగే పాలను ఉదయం తాగడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇలా బరువు తగ్గడం తేలికవుతుంది. కనుక పాలను తాగితే బరువు తగ్గుతారనే చెప్పవచ్చు. ఇక పాలను తాగితే మన శరీరంలో జీఎల్‌పీ-1, పీవైవై, సీసీకే వంటి హార్మోన్ల ఉత్పత్తి పెరుగుతుంది. ఇవి ఆకలిని తగ్గిస్తాయి. దీని వల్ల మనం ఆహారం తక్కువగా తింటాం. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. కనుక బరువు తగ్గాలని చూస్తున్నవారు పాలను ఉదయం తాగితే మేలు జరుగుతుంది.

### రాత్రి పూట అయితే..

పోషకాహార నిపుణులు చెబుతున్న ప్రకారం రోజూ రాత్రి నిద్రకు ముందు ఒక గ్లాస్ గోరు వెచ్చని పాలను తాగాలి. దీని వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్ర చక్కగా పడుతుంది. నిద్రలేమి తగ్గుతుంది. పాలలో ట్రిప్టోఫాన్, మెగ్నిషియం, మెలటోనిన్ అనే పోషకాలు ఉంటాయి. ఇవి నిద్ర చక్కగా పట్టేలా చేస్తాయి. మైండ్ రిలాక్స్ అయ్యేలా చూస్తాయి. దీంతో నిద్ర త్వరగా పడుతుంది. రోజూ పాలను తాగుతుంటే నిద్రలేమిని తగ్గించుకోవచ్చు. అలాగే మానసిక ఆరోగ్యం సైతం మెరుగు పడుతుంది. పాలను రాత్రి పూట సేవించడం వల్ల శరీర మెటబాలిజం పెరుగుతుంది. దీంతో రాత్రి పూట మీరు నిద్రిస్తున్నా కూడా మీ శరీరం క్యాలరీలను ఖర్చుచేస్తుంది. దీంతో కొవ్వు కరిగి బరువు తగ్గుతారు. ఇలా బరువు తగ్గేందుకు పాలు ఎంతో దోహదం చేస్తాయి.

### ఏ సమయంలో తాగాలి..

పాలలో క్యాల్షియం, విటమిన్ డి, లినోలినిక్ యాసిడ్ అధికంగా ఉంటాయి. ఇవి మెటబాలిజంను మెరుగు పరుస్తాయి. దీని వల్ల బరువు తగ్గడం తేలికవుతుంది. పాలను ఉదయం తాగడం వల్ల కండరాలు నిర్మాణమవుతాయి. కండరాలు మరమ్మత్తులకు గురవుతాయి. శరీరానికి శక్తి లభిస్తుంది. రోజంతా శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి. రోజంతా యాక్టివ్‌గా పనిచేయవచ్చు. పాలను రాత్రి పూట సేవిస్తే బరువు తగ్గడంతోపాటు నిద్ర సమస్యలు కూడా దూరమవుతాయి. అయితే రాత్రి పూట పాలను తాగేవారు కొవ్వు తీసిన పాలను తాగాలి. లేదంటే శరీరంలో కొవ్వు చేరుతుంది. పాలను రాత్రిపూట సేవిస్తే అందులో తేనె, మిరియాల పొడి, పసుపు వంటివి కలిపి తాగితే ఇంకా ఎంతో మేలు జరుగుతుంది. ఇలా పాలను రోజులో వివిధ సమయాల్లో తాగడం వల్ల భిన్నమైన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఆరోగ్యంగా ఉండవచ్చు.

# శీతాకాలం.. పిల్లలను వ్యాధుల నుండి రక్షించడానికి ఇలా చేయండి.!

శీతాకాలంలో పిల్లలకు రోగనిరోధక శక్తి తగ్గుతుంది. ఎందుకంటే చలి కారణంగా చర్మం పొడిగా మారడం, శ్వాసకోశ సమస్యలు పెరగడం, వైరస్‌లు సులభంగా వ్యాప్తి చెందడం వంటివి జరుగుతాయి. దీనిని ఎదుర్కోవడానికి, వారికి విటమిన్లు, పోషకాలు సమృద్ధిగా ఉన్న ఆహారం అం దించడం, తగినంత నిద్ర పోయేలా చూడటం, పరిశుభ్రత పాటించడం వంటివి చాలా ముఖ్యం. ఈ సీజన్‌లో మీ బిడ్డకు వెచ్చని దుస్తులు ధరించండి.



### పరిశుభ్రత

శీతాకాలంలో పిల్లల పరిశుభ్రతను కాపాడుకోవడం చాలా ముఖ్యం. చేతులు కడుక్కోవడం అలవాటు చేసుకోవడం వల్ల అనేక అనారోగ్యాలను నివారించవచ్చు. తినడానికి ముందు,తర్వాత చేతులు కడుక్కోవడం అలవాటు చేయించాలి. ఈ సమయంలో పిల్లల దుస్తులను శుభ్రంగా ఉంచండి. శీతాకాలంలో పిల్లలకు ఎప్పుడూ గోరువెచ్చని నీటితో స్నానం చేయడం నేర్పండి.

### పండ్లు, కూరగాయలు ఇవ్వండి

శీతాకాలంలో రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది. దీని వలన పిల్లలు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో మీ పిల్లల రోగనిరోధక శక్తిని పెంచడానికి వారికి నిమ్మకాయలు, పండ్లు, కూరగాయలు ఇవ్వండి.

### నీరు ఎక్కువగా తాగడం అలవాటు చేయండి

శీతాకాలంలో చాలా మంది తక్కువ నీరు తాగడం వల్ల డీహైడ్రేషన్ ఎక్కువగా ఉంటుంది. ఈ సమస్య పిల్లల్లో కూడా కనిపిస్తుంది. కాబట్టి, హైడ్రేషన్ పై శ్రద్ధ వహించండి. పిల్లలకు సూప్, జ్యూస్, గోరువెచ్చని నీరు అందించండి. మంచి ఆరోగ్యం కోసం, ప్రతి ఉదయం మీ బిడ్డకు గోరవెచ్చని నీరు ఇవ్వండి.

### రోగనిరోధక శక్తిని బలోపేతం చేయండి

రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి పప్పుధాన్యాలు, ఆకుపచ్చ కూరగాయలు, పండ్లు, పాలు, పెరుగు, గుడ్లు, గింజలు వంటి పోషకమైన ఆహారాలను వారి ఆహారంలో చేర్చండి. జంక్ ఫుడ్‌ను నివారించండి. అలాగే, వారికి తగినంత నిద్ర, కొంత శారీరక శ్రమ ఉండేలా చూసుకోండి.

# చేతులు, కాళ్ళు తిమ్మిరిగా అనిపిస్తున్నాయా? ఇది తెలుసుకోండి..!

ఎక్కువసేపు ఒకే స్థితిలో కూర్చోవడం లేదా నిద్రపోవడం వల్ల చేతులు, కాళ్ళు తిమ్మిరికి కారణమవుతాయి. అంతేకాకుండా చేతులు, కాళ్ళ జలదరింపు లేదా తిమ్మిరి.. బలహీనత, పోషక లోపాలను సూచిస్తుంది. అయితే, ఈ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే, అది తీవ్రమైన న్యూరోపతిగా అభివృద్ధి చెందుతుంది. అయితే, ఈ ముఖ్యమైన పోషకాలను తీసుకోవడం ద్వారా మీరు ఈ సమస్య నుండి భయటపడవచ్చు.



### విటమిన్ బి12

విటమిన్ బి12 మన నరాలకు అత్యంత ముఖ్యమైన పోషకం. మన నరాలకు రక్షణ కవచాన్ని అందించడానికి మైలిన్ కోశం అనే పదార్థం అవసరం. విటమిన్ బి12 లోపం ఉంటే, శరీరంలో మైలిన్ కోశం ఏర్పడటం తగ్గుతుంది. ఈ నరాల పొర బలహీనపడటం ప్రారంభించినప్పుడు చేతులు, కాళ్ళలో తిమ్మిరి, జలదరింపు లేదా బలహీనత వంటి సమస్యలు తలెత్తుతాయి. సాధారణంగా, న్యూరోపతి రోగులలో విటమిన్ బి12 లోపం కనిపిస్తుంది. విటమిన్ బి12 లోపాన్ని అధిగమించడానికి జున్ను, చేపలు, గుడ్లు, పెరుగు, పాలు, చికెన్ మొదలైనవి తినాలి.

### విటమిన్ బి1

మన నరాలు సరిగ్గా పనిచేయడానికి నిరంతరం శక్తి అవసరం. విటమిన్ బి1 మన నరాలకు శక్తిని అందిస్తుంది. శరీరంలో దాని లోపం ఉంటే, మన నరాలు క్రమంగా బలహీనపడటం ప్రారంభిస్తాయి. దీని వలన కాళ్ళలో నొప్పి లేదా మంట వస్తుంది. విటమిన్ బి1 మన నరాలకు ఇంధనంగా పనిచేస్తుంది. నరాలలో సరైన మొత్తంలో లేకపోతే చేతులు, కాళ్ళలో తిమ్మిరి కనిపిస్తుంది. విటమిన్ బి1 కోసం పొద్దుతిరుగుడు విత్తనాలు, వేరుశెనగలు, బ్రౌన్ రైస్, కిడ్నీ బీన్స్ మొదలైనవి తినండి.

నరాల మరమ్మత్తుకు ఫోలిక్ ఆమ్లం చాలా అవసరం. ఫోలిక్ ఆమ్లం కోసం దుంపలు, బ్రోకలీ, ఆకుకూరలు, సిట్రస్ పండ్లు తినవచ్చు. మన నరాలను సడలించడానికి కొన్ని ఖనిజాలు చాలా ముఖ్యమైనవి. మెగ్నీషియం లోపం కారణంగా, మన శరీరంలో కాళ్ళలో తిమ్మిరి, స్ట్రెయిన్లు, దృఢత్వం సమస్య పెరగడం ప్రారంభమవుతుంది, దీని కారణంగా మన నరాల మీద ఒత్తిడి ఏర్పడుతుంది. న్యూరోపతి లక్షణాలు బయటపడటం ప్రారంభిస్తాయి. వైద్యుల ప్రకారం, మెగ్నీషియం కోసం పాలకూర, బాదం, పెరుగు, అరటిపండు, గుమ్మడికాయ గింజలను తీసుకోండి.

# వన్డేలే నా ఫ్యూచర్..

### టెస్టుల్లో కం బ్యాక్ ఇవ్వడం కుదరదు

### విరాట్ కోహ్లీ కీలక వ్యాఖ్యలు



దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌ను విరాట్ కోహ్లీ అద్భుతమైన సెంచరీతో మొదలుపెట్టాడు. వన్డే కెరీర్ లో కోహ్లీకిది 52వ సెంచరీ. మ్యాచ్ తర్వాత, అతను టెస్ట్ క్రికెట్‌లోకి తిరిగి వస్తాడా? అని గత కొంతకాలం నుంచి అడుగుతున్న ప్రశ్నకు సమాధానం చెప్పాడు. తొలి వన్డేలో 135 పరుగులు చేసి, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచిన తర్వాత, కోహ్లీ ప్రస్తుతం వన్డే ఫార్మాట్‌పై మాత్రమే దృష్టి పెడుతున్నానని స్పష్టం చేశాడు. "ఇది ఇలాగే ఉండబోతోంది, నేను ఒకే ఫార్మాట్ ఆడుతున్నాను" అని కోహ్లీ చేసిన ఈ ప్రకటన రన్ మేషిన్ ఫ్యూచర్ ప్లాన్ ఏంటన్నది తేలిపోయింది. రాంచీలో జరిగిన తొలి మ్యాచ్‌లో కోహ్లీ 120 బంతుల్లో 135 పరుగులు చేసి తన 52వ వన్డే సెంచరీని పూర్తి చేసుకున్నాడు. తద్వారా ఇప్పటికీ వైట్ బాల్ కింగ్ తానేనని మరోసారి నిరూపించాడు. అతని ఇన్నింగ్స్ భారత్‌ను పటిష్ట స్థితికి వెళ్లడంతో పాటు ఉత్కంఠపోరులో విజయాన్ని అందించింది. మ్యాచ్ అనంతరం జరిగిన కార్యక్రమంలో టెస్ట్ క్రికెట్‌లోకి మళ్లీ వస్తారా అని ప్రశ్నించగా, కోహ్లీ ఏమాత్రం సంకోచించకుండా, ఇప్పుడు తన శరీరం, మనసు అవసరాలను అర్థం చేసుకున్నానని, ప్రస్తుతం ఒకటి కంటే ఎక్కువ ఫార్మాట్‌లు ఆడటం సాధ్యం కాదని స్పష్టం చేశాడు. టెస్టుల్లో కం బ్యాక్ ఇవ్వడం కుదరదని తేల్చి చెప్పేశాడు.కొద్ది రోజుల క్రితం, బీసిసిఐ కొంతమంది అనుభవజ్ఞులైన ఆటగాళ్లను తిరిగి టెస్ట్ జట్టులోకి తిరిగి తీసుకురావాలని యోచిస్తోందని వార్తలు వచ్చాయి. ఇందులో కోహ్లీ, రోహిత్ పేర్లు ఉన్నాయి. 37 ఏళ్ల వయసులో కోహ్లీ మునుపటిలా అన్ని ఫార్మాట్లలో కొనసాగలేనని భావిస్తున్నాడు. మ్యాచ్‌కు ఒక రోజు ముందు తాను పూర్తిగా విశ్రాంతి తీసుకున్నానని, తద్వారా ఎనర్జీ నిలుపుకున్నానని చెప్పాడు. తన మనస్సు చురుకుగా ఉన్నంత వరకు, శరీరం ఫిట్‌గా ఉన్నంత వరకు, ఆట మరింత సులభం అనిపిస్తుందని" కోహ్లీ పేర్కొన్నాడు. పిచ్ ప్రారంభంలో బ్యాటింగ్‌కు ఈజీ అనిపించిందని, కానీ తర్వాత నెమ్మదించింది. అటువంటి పరిస్థితిలో, అవగాహన, షాట్ సెలక్షన్, అనుభవం చాలా ఉపయోగపడ్డాయి. ప్రాక్టీస్‌పై నమ్మకం ఉంచనని, తన మానసిక బలం, ఆటపై ఉన్న ఇష్టం, డెడికేషన్‌పై నమ్మకం ఉంచుతానని' కోహ్లీ స్పష్టం చేశాడు. తాను కేవలం వన్డేలు మాత్రమే ఆడాలని భావిస్తున్నట్లు కోహ్లీ స్వయంగా ప్రకటించాడు. అంటే 2027 వన్డే వరల్డ్ కప్ కోసం ఒక్క ఫార్మాట్లోనే కొనసాగుతున్నట్లు ఇండైరెక్టుగా కోహ్లీ చెప్పకనే చెప్పేశాడు. దాంతో వన్డే వరల్డ్ కప్ వరకు కోహ్లీ ఆడతాడా అనే ఊహాగానాలకు చెక్ పెట్టాడు.కోహ్లీ ఇదే ఫిట్ నెస్ మెయింటైన్ చేస్తే ఈజీగా మరో మూడేళ్ళ క్రికెట్ ఆటగలడు. అందులోనూ కేవలం ఒకే ఫార్మాట్లో ఆడుతున్నందున అంతగా ఒత్తిడి, అలసట సైతం అనిపించవు. మధ్యలో ఏడాదికి రెండు నెలలపాటు ఐపీఎల్ సీజన్ తో బిజీగా ఉంటాడు. కనుక వచ్చే వరల్డ్ కప్ కోహ్లీ లక్ష్యమని తేలిపోయింది. తొలి వన్డేలో రోహిత్ శర్మతో కలిసి 135 పరుగుల శతక భాగస్వామ్యం భారత ఇన్నింగ్స్ ను నిలబెట్టింది. కోహ్లీ సెంచరీ అయితే మరో లెవల్ అనిపించింది.

## విరాట్ సెంచరీకి రోహిత్ సెలబ్రేషన్స్



సౌతాఫ్రికాతో తొలి వన్డేలో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సెంచరీ కదం తొక్కాడు. ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడుతూ రాంచీ స్టేడియంలో బౌండరీల వర్షం కురిపించాడు. మళ్లీ పాత విరాట్‌ను గుర్తుచేస్తూ, 120 బంతుల్లోనే 135 పరుగులు చేసి క్లాస్ శాశ్వతం అని చాటిచెప్పాడు. విరాట్ సెంచరీ మార్క్ అందుకోగానే బెబ్బులిలా గర్జిస్తూ మైదానంలో సంబరాలు చేసుకున్నాడు. ఈ క్రమంలో విరాట్ సెంచరీని రోహిత్ శర్మ సెలబ్రేట్ చేసుకున్న తీరు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.99 పరుగుల వద్ద విరాట్ ఫోర్ బాది సెంచరీ పూర్తి చేశాడు. దీంతో విరాట్ స్టేడియంలో సంబరాలు చేసుకుంటే, సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మ డ్రెస్సింగ్ రూమ్‌లో సెలబ్రేట్ చేసుకున్నాడు. ఈ సమయంలో రోహిత్ తన శైలికి భిన్నంగా కాస్త అగ్రెసివ్ మోడ్‌లో కనిపించాడు. విరాట్ సెంచరీ చేయగానే లేచి నిలబడి చప్పట్లు కొడుతూ 'మాస్' లెవెల్‌లో రోహిత్ సెలబ్రేట్ చేసుకున్నాడు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. తమ ఫామ్, ఫిట్‌నెస్‌పై సందేహాలు వ్యక్తం చేస్తున్న వాళ్లకు కౌంటర్ ఇచ్చినట్లుగా రోహిత్ రియాక్షన్ ఉందంటూ ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు.అయితే రో-కో ద్వయం ఇప్పుడు కేవలం వన్డేల్లోనే ఆడుతోంది. 2027 వరల్డ్‌కప్‌లో ఆడాలనే ఉద్దేశంతోనే ఈ ఇద్దరు స్టార్లు పూర్తి ఫిట్‌నెస్ మెయింటెన్ చేస్తున్నారు. అయితే కొంతకాలంగా ఈ ఇద్దరు ఎంత గొప్పగా ఆడినా, వరల్డ్‌కప్ నాటికి పరిస్థితులు మారతాయని, ఆ జట్టులో ఈ ఇద్దరూ ఉంటారని కచ్చితంగా చెప్పలేం అంటూ ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో తొలి వన్డేలో రోహిత్, విరాట్ రాణించడంతో అభిమానులు ఫుల్ ఖుషీగా ఉన్నారు.

## అరుదైన ఘనతను సొంతం చేసుకున్న రో-కో జోడి

మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య రాంచి వేదికగా జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో.. టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో భారత్ 8 వికెట్ల నష్టానికి 349 పరుగులు సాధించింది. అయితే తుది జట్టులో చోటు దక్కించుకున్న రో-కో జోడి ఓ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది.రోహిత్ శర్మ-విరాట్ కోహ్లీ.. భారతదేశం తరపున అత్యధిక అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన జోడీగా చరిత్ర సృష్టించారు. ఈ క్రమంలో వీరు దిగ్గజ ఆటగాళ్లు సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్ జోడీని అధిగమించారు. సచిన్-ద్రావిడ్ జోడి టీమిండియా తరుపున 391 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో బరిలోకి దిగారు. రాంచి మ్యాచ్‌లో బరిలోకి దిగడంతో రో-కో ద్వయం వీరి రికార్డును బ్రేక్ చేశారు. రోహిత్-కోహ్లీ తాజా మ్యాచ్‌తో కలిపి 392 అంతర్జాతీయ మ్యాచ్‌లో కలిసి బరిలోకి దిగారు. టీమిండియా తరఫున అత్యధిక అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన జోడీలు వీరే..

1. రోహిత్ శర్మ - విరాట్ కోహ్లీ - 392 మ్యాచ్‌లు
2. సచిన్ టెండూల్కర్ - రాహుల్ ద్రవిడ్ - 391 మ్యాచ్‌లు
3. రాహుల్ ద్రవిడ్ - సౌరవ్ గంగూలీ - 369 మ్యాచ్‌లు
4. సచిన్ టెండూల్కర్ - అనిల్ కుంబ్లే - 367 మ్యాచ్‌లు
5. సచిన్ టెండూల్కర్ - సౌరవ్ గంగూలీ - 341 మ్యాచ్‌లు
6. విరాట్ కోహ్లీ - రవీంద్ర జడేజా - 310 మ్యాచ్‌లు

## ముచ్చల్‌కు ముందే ప్రేమ వ్యవహారం



క్రికెటర్ స్మృతి మంధానా, బాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ పలాష్ ముచ్చల్ వివాహం చివరి నిమిషంలో ఆగిపోవడం తెలిసిందే. త్వరలోనే వీరిద్దరూ పెళ్లి పీటలు ఎక్కుతారని పలాష్ తల్లి ఇటీవల మీడియాకు తెలిపారు. కానీ పలాష్ ముచ్చల్ ముందే ప్రేమ వ్యవహారం నడిపించాడని, మంధానాను మోసం చేశాడంటూ లవర్‌తో జరిపిన చాటింగ్ స్క్రీన్ షాట్లు వైరల్ అయ్యాయి. వాస్తవానికి పలాష్ ముచ్చల్, స్మృతి మంధానా నవంబర్ 23న వివాహం చేసుకోవాల్సి ఉంది. పెళ్లికి సంబంధించిన వేడుకలు రెండు, మూడు రోజులు ఘనంగా జరిగాయి. వారి హల్దీ, మెహందీ, సంగీత్ వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో చాలా వైరల్ అయ్యాయి. కానీ, అకస్మాత్తుగా వారి పెళ్లి వాయిదా పడిందనే వార్తలు వచ్చాయి. స్మృతి మంధాన తండ్రి ఆరోగ్యం అకస్మాత్తుగా క్షీణించింది. దీని కారణంగా, ఆయనను కుటుంబసభ్యులు ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. స్మృతి తండ్రి ఆసుపత్రిలో ఉండటంతో, ఆ సమయంలో తాను పెళ్లి చేసుకోలేనంటూ మంధాన తన వివాహాన్ని వాయిదా వేసుకుందని సన్నిహితులు తెలిపారు. ఆ మరుసటి రోజే పలాష్ అస్వస్థతకు లోనయ్యాడని వార్తలు వచ్చాయి. ఇప్పుడు పెళ్లి వాయిదా పడిన తర్వాత పలాష్ ముచ్చల్ తొలిసారి బయట కనిపించాడు. మ్యూజిక్ డైరెక్టర్ పలాష్ ముచ్చల్ విమానాశ్రయంలో కనిపించాడు. అతను పూర్తి బ్లాక్ ఔట్ ఫిట్ లుక్ లో కనిపించాడు. పలాష్ బ్లాక్ షర్ట్, ప్యాంటు ధరించాడు. చేతిలో పుస్తకం, ఫోన్‌తో కనిపించాడు. పెళ్లి వాయిదా తరువాత తొలిసారి పలాష్ ముచ్చల్ కనిపించడంతో వీడియో చాలా వేగంగా వైరల్ అవుతోంది.స్మృతి మంధాన, పలాష్‌ల పెళ్లి వాయిదా పడిన తర్వాత, పలాష్ క్రికెటర్ స్మృతిని మోసం చేశాడని సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. పలాష్ ప్రేమించిన అమ్మాయితో చాట్ చేసినట్లు కూడా వైరల్ అయింది. దీనిపై పలాష్, స్మృతి మంధానా గానీ ఇంకా స్పందించలేదు. పలాష్ కజిన్ పలాష్‌కు మద్దతు ఇచ్చింది. పలాష్ తల్లి సైతం వారి పెళ్లి గురించి అప్‌డేట్ ఇచ్చింది. హిందుస్థాన్ టైమ్స్‌తో మాట్లాడుతూ, స్మృతి తండ్రికి ఆరోగ్యం బాగాలేని కారణంగా పెళ్లిని వాయిదా వేయాలని పలాష్ మొదటగా చెప్పాడని ఆయన పలాష్ తల్లి అమితా తెలిపారు. స్మృతి మంధానకు తండ్రి అంటే చాలా ఇష్టమని, పలాష్ సైతం ఆయనను చాలా గౌరవిస్తాడని చెప్పారు. స్మృతితో ఉన్నట్లుగానే పలాష్‌తోనూ మంధాన తండ్రి ఎక్కువ సన్నిహితంగా ఉంటాడని తెలిపారు. స్మృతి, పలాష్‌ల పెళ్లి ఆగిపోయిందా, లేక వాయిదా వేశారా అనే విషయంపై ఇంకా క్లారిటీ లేదు. మంధాన కుటుంబం నుంచి పెళ్లి గురించి ఎలాంటి స్పందన లేదు. కానీ పలాష్ వైపు నుంచి మాత్రం వివాహ వేడుక త్వరలో జరుగుతుందని చెబుతున్నారు.

# గంభీర్, అగార్కర్‌తో బీసీసీఐ సమావేశం



రాంచీ వన్డేలో సౌతాఫ్రికాపై సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ అద్భుతంగా రాణించారు. జట్టు భారీ స్కోర్ సాధించడంలో ఈ ఇద్దరు స్టార్లు బలమైన పునాది వేశారు. సొంతగడ్డపై టెస్టు సిరీస్ కోల్పోయిన పరిస్థితుల్లో, రో-కో టచ్‌లోకి రావడం భారత్‌కు కలిసొచ్చే అంశం. అయితే సీనియర్లు ఫామ్‌లోకి వచ్చిన నేపథ్యంలో భారత్ హెడ్ కోచ్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌తో బీసీసీఐ సడెన్‌గా మీటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. సౌతాఫ్రికాతో రెండో వన్డేకు ముందుగానే ఈ మీటింగ్ ఉండనున్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి.డిసెంబర్ 3న సౌతాఫ్రికాతో రెండో వన్డే జరగనుంది. ఈ మ్యాచ్ కంటే ముందే ఈ మీటింగ్ ఏర్పాటు చేయనున్నారు. ఈ సమావేశానికి ఇటీవల నూతనంగా ఎన్నికైన బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ హాజరవుతారో లేదో ఇంకా క్లారిటీ రాలేదు. కానీ, బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా, జాయింట్ సెక్రటరీ ప్రభ్‌తేజ్ సింగ్, కోచ్ గౌతమ్ గంభీర్, సెలక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్ పాల్గొననున్నట్లు తెలుస్తోంది.ఈ సమావేశంలో ముఖ్యంగా రోహిత్- కోహ్లీ భవిష్యత్ గురించే చర్చించే అవకాశం ఉంది. అక్టోబర్‌లో ఆస్ట్రేలియా సిరీస్, తాజాగా సౌతాఫ్రికాపై తొలి వన్డేలో రో-కో జోడీ రాణించింది. ఈ నేపథ్యంలో 2027 వన్డే వరల్డ్‌కప్ టోర్నీకి రోడ్ మ్యాప్, రోహిత్, కోహ్లీ విషయంలో ఎలా ముందుకు వెళ్లాలనే అంశాలపై చర్చ జరిగే అవకాశం ఉంది. అలాగే వచ్చే ఏడాది టీ20 వరల్డ్?కప్ టోర్నీ ఉండనుంది. దాంతోపాటు టీమ్‌ఇండియా ఇటీవల సౌతాఫ్రికాతో 2-0తో టెస్టు సిరీస్ ఓడడంపై రివ్యూ నిర్వహించే ఛాన్స్ ఉంది. ఇలాంటివి మళ్లీ పునరావృతం కాకుండా, భవిష్యత్?లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రణాళికలపై కీలక సమావేశం జరగనుంది.అయితే విరాట్- రోహిత్ టచ్?లోకి రావడం, భారీ స్కోర్లు సాధిస్తున్న క్రమంలో గంభీర్, అగార్కర్‌తో బీసీసీఐ మీటింగ్ ఏర్పాటు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే ఈ ఇద్దరు టెస్టు ఫార్మాట్ నుంచి తప్పుకోవడానికి గంభీరే కారణం అనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో అభిమానుల్లోనూ ఈ సమావేశంపై ఆసక్తి ఏర్పడింది.

## క్రికెటర్ రిటైర్మెంట్‌పై వెనక్కి తగ్గొచ్చా?

టీ20 ప్రపంచ కప్ 2024 తర్వాత విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఫార్మాట్-నిర్దిష్ట రిటైర్మెంట్ ప్రకటించినప్పుడు, భారత అభిమానులకు ఇది సహజమైన చర్యగా అనిపించింది, కానీ మే 2025 వచ్చేసరికి, ఇద్దరు దిగ్గజాలు టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకోవడంతో మొత్తం భారత క్రికెట్ ప్రపంచం ఆశ్చర్యపోయింది. దీంతో టెస్ట్ అభిమానులు కోహ్లీ రిటైర్మెంట్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేయడంతో, ఒక ఆటగాడు ఎన్నిసార్లు అయినా రిటైర్మెంట్ తీసుకోవచ్చు. రిటైర్మెంట్, తిరిగి రావడానికి ఐసిసి ఎటువంటి పరిమితిని విధించలేదు. అంటే, ఆటగాడు కోరుకుంటే ఎన్నిసార్లు అయినా రిటైర్మెంట్ తీసుకోవచ్చు. ఎన్నిసార్లు అయినా జట్టులోకి తిరిగి రావచ్చు. ఆటగాడు తిరిగి వచ్చే పరిస్థితిలో తన బోర్డు, సెలెక్టర్ల నుండి అధికారిక అనుమతి తీసుకోవాలని ఐసిసి చెబుతోంది. ఆడాలా వద్దా అనేది పూర్తిగా కొత్త టీమ్ మేనేజ్‌మెంట్, క్రికెట్ బోర్డు చేతుల్లో మాత్రమే ఉంటుంది. రిటైర్మెంట్ ఎల్లప్పుడూ వయస్సు కారణంగా తీసుకోరు. దీని వెనుక చాలా కారణాలు ఉండవచ్చు - ఫిట్‌నెస్ తగ్గిపోవడం, పనితీరు ఒత్తిడి, జట్టులో స్థానం గురించి అనిశ్చితి, వ్యక్తిగత కారణాలు, నిరంతరం ఆడుతూ ఉండటం వల్ల కలిగే మానసిక అలసట, వివాదం లేదా విమర్శలకు దూరంగా ఉండటం. ఆటగాళ్ళు కొన్నిసార్లు భావోద్వేగాలలో కూడా నిర్ణయాలు తీసుకుంటారు, తరువాత పరిస్థితులు మారినప్పుడు తిరిగి రావడానికి మార్గం వెతుకుతారు. క్రికెట్ చరిత్రలో, ఆటగాళ్ళు పదేపదే రిటైర్మెంట్ తీసుకున్న, అన్నిసార్లు తిరిగి వచ్చిన అనేక ఉదాహరణలు ఉన్నాయి. షాహిద్ అఫ్రిది అత్యధిక సార్లు రిటైర్ అయిన ఆటగాడు. అఫ్రిది 2006లో టెస్ట్ క్రికెట్ వదిలేశాడు, ఆ తర్వాత కొన్ని నెలల్లో తిరిగి వచ్చాడు. 2011లో అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్నాడు, కానీ మళ్ళీ తిరిగి వచ్చాడు. అతని కెరీర్ రిటైర్మెంట్- రిటర్న్ కథలా ఉంది. మొహమ్మద్ అమీర్ 2020లో రిటైర్మెంట్ తీసుకుని 2024లో తిరిగి వచ్చాడు. 2020లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అమీర్, టీ20 ప్రపంచ కప్ 2024 కోసం తిరిగి రావాలని ప్రకటించి మళ్ళీ చర్చల్లోకి వచ్చాడు. బెన్ స్టోక్స్ 2022లో వన్డేల నుంచి రిటైర్ అయ్యాడు, కాని 2023 ప్రపంచ కప్‌లో ఇంగ్లాండ్‌ను రక్షించడానికి మళ్ళీ వచ్చాడు. కెవిన్ పీటర్సన్ 2011లో వైట్ బాల్ రిటైర్మెంట్ తీసుకున్నాడు. కొన్ని నెలల తర్వాత తిరిగి వచ్చాడు. ఆటగాడి తిరిగి రావడానికి ఎటువంటి ఆంక్షలు విధించలేదు. ఇది పూర్తిగా సెలెక్టర్లు, బోర్డు, ఆటగాడి ఇష్టతపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి, ఈ రోజు ఒక ఆటగాడు రిటైర్ అయితే, ఈ నిర్ణయం ఎల్లప్పుడూ అంతిమం కాదని అభిమానులు అర్థం చేసుకోవాలి, తిరిగి రావడానికి మార్గం ఎల్లప్పుడూ తెరిచే ఉంటుంది. దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌ను కోహ్లీ గొప్పగా ప్రారంభించాడు. టెస్టు క్రికెట్‌కు తిరిగి వస్తాడా అనే ప్రశ్నకు స్పష్టమైన ముగింపు పలికాడు. మొదటి వన్డేలో 135 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికైన తర్వాత, తాను ప్రస్తుతం వన్డే ఫార్మాట్‌పై పూర్తి స్థాయిలో దృష్టి పెడతానని కోహ్లీ స్పష్టంగా చెప్పాడు. "ఇలానే ఉంటుంది, నేను ఒకే ఫార్మాట్‌లో ఆడుతున్నాను" అని కోహ్లీ ప్రకటన తన భవిష్యత్తు ప్రణాళికలను స్పష్టంగా వివరిస్తుంది.

## కోహ్లీ, రోహిత్‌ల అద్భుత ప్రదర్శనతోనే విజయం

### మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ ప్రశంసలు

సీనియర్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల అద్భుత ప్రదర్శనతోనే తొలి వన్డేలో టీమిండియా విజయం సాధించిందని మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ అన్నాడు. కోహ్లీ, రోహిత్‌లు విఫలమై ఉంటే టీమిండియా ఓటమిపాలయ్యేదని తెలిపాడు. సౌతాఫ్రికాతో ఆదివారం జరిగిన తొలి వన్డేలో టీమిండియా 17 పరుగుల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే.ఈ మ్యాచ్‌లో టీమిండియా ఆదిలోనే ఓపెనర్ యశస్వి జైస్వాల్ వికెట్‌ను కోల్పోగా.. కోహ్లీ-రోహిత్ అద్భుతమైన భాగస్వామ్యంతో జట్టును ఆదుకున్నారు. రెండో వికెట్‌కు 136 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. కోహ్లీ సెంచరీతో రాణించగా.. రోహిత్ శర్మ హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. ఈ ఇద్దరి అద్భుతమైన బ్యాటింగ్‌తో టీమిండియా 349 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది.అనంతరం సౌతాఫ్రికా బ్యాటర్లు విజయం కోసం ఆఖరి వరకు పోరాడారు. కానీ కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా అద్భుత బౌలింగ్‌తో జట్టుకు విజయాన్నందించారు. ఈ మ్యాచ్‌పై తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన మహమ్మద్ కైఫ్.. కోహ్లీ, రోహిత్ లేకుంటే టీమిండియా ఓటమిపాలయ్యేదని తెలిపాడు.విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ త్వరగా ఔటై ఉంటే తొలి వన్డేలో టీమిండియా ఓటమిపాలయ్యేది. కోహ్లీ, రోహిత్ రాణించకుంటే టీమిండియా భారీ స్కోర్ చేసేది కాదు. 300, 350 రన్స్ చేయకుండా సౌతాఫ్రికా ఈజీగా భారత్‌ను ఓడిస్తుంది. ఈ గెలుపు క్రెడిట్ పూర్తిగా రోహిత్, విరాట్ కోహ్లీదే.యువ ఆటగాళ్లు, కుర్రాళ్లను జట్టులోకి తీసుకురావడం గురించి చాలా మంది మాట్లాడుతున్నారు. కానీ వారు కనీసం 200 పరుగులు కూడా చేయలేరు. కాబట్టి జట్టుకు విజయాలు కావాలంటే కోహ్లీ, రోహిత్‌లను జట్టులో కొనసాగించాల్సిందే. విరాట్ కోహ్లీ సెంచరీతో ఈ విజయంలో కీలక పాత్ర పోషించాడు. అతను ఏడు సిక్సర్లు కొట్టగా.. రోహిత్ శర్మ మూడు సిక్సర్లు బాదాడు. వారు ఒక కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ సిరీస్‌కు ముందు సిడ్నీలోనూ వారు ఇదే తరహాలో రాణించారు.సౌతాఫ్రికాతో టెస్ట్ సిరీస్ పరాజయం అనంతరం భారత జట్టు పరిస్థితి దారుణంగా తయారైంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ విజయం ఉపశమనం కలిగించింది. ఓల్డ్ ఈజ్ గోల్డ్ అన్నట్లు కోహ్లీ, రోహిత్ అవసరం జట్టుకు ఉంది. కోహ్లీకి 37, రోహిత్‌కి 38 ఏళ్ల వయసు. అయినా వారు అద్భుతంగా ఆడారు. వారు గనుక పరుగులు చేయకపోయి ఉంటే సౌతాఫ్రికా ఈ మ్యాచ్‌ను చాలా సునాయసంగా గెలిచేది.'అని మహమ్మద్ కైఫ్ పేర్కొన్నారు.



# దర్శకుడు శాంతారామ్ బయోపిక్

## సంధ్య పాత్రలో ప్రముఖ నటి తమన్నా

నటి తమన్నా భాటియా వరుసగా హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విభిన్నమైన పాత్రలతో జోరు మీదున్నారు. ఇటీవల ఓదెలా 2లో శక్తివంతమైన పాత్రతో, అలాగే అజయ్ దేవగన్ నటించిన రైడ్ 2లో ఆకట్టుకునే రోల్‌తో ప్రేక్షకులను మెప్పించిన ఆమెకు ఇప్పుడు మరో బిగ్ ఆఫర్ వచ్చినట్టు చిత్ర పరిశ్రమలో టాక్ నడుస్తోంది. తాజా సమాచారం ప్రకారం, ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు ..వీ. శాంతారాం జీవితకథ ఆధారంగా బయోపిక్ రూపొందించనుండగా, అందులో తమన్నా ఒక ముఖ్య పాత్రలో కనిపించ బోతున్నారు. అందులో ఆమె, శాంతారం భార్య అయిన ప్రముఖ నటి సంధ్య పాత్రను పోషించనున్నట్లు చెప్పకుంటున్నారు. హిందీ, మరాఠీ సినిమాల్లో సాంధ్య ఓ ప్రముఖ నటి. వీ. శాంతారాం దర్శకత్వంలో ఆమె నటించిన అనేక చిత్రాలు అప్పట్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నాయి. అందువల్ల సాంధ్య పాత్ర ఈ బయోపిక్‌లో అత్యంత ప్రాధాన్యమైనదిగా భావిస్తున్నారు. ఈ బయోపిక్‌కు 'చిత్రపతి వీ. శాంతారాం' అనే టైటిల్ ఖరారు చేసినట్లు సమాచారం. బాలీవుడ్ నటుడు సిద్ధాంత్ చతుర్వేది వీ. శాంతారాం పాత్రలో నటించనున్నాడు. ఆయన కెరీర్‌లో ఇది భిన్నమైన, ప్రతిష్టాత్మక పాత్ర అవుతుందని పరిశ్రమ అంచనా వేస్తోంది. ఈ చిత్రాన్ని 'నటసామ్రాట్' సినిమాతో ప్రశంసలు అందుకున్న దర్శకుడు అభిజిత్ దేశ్‌పాండే తెరకెక్కిస్తున్నారు. భావోద్వేగాలు, పాత్రల లోతును చూపడంలో ఆయనకు ఉన్న నైపుణ్యం దృష్ట్యా ఈ సినిమా కూడా ప్రత్యేకంగా నిలవొచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి. కథ విన్న వెంటనే తమన్నా ఈ పాత్రపై ఆసక్తి చూపి అంగీకరించినట్లు తెలుస్తోంది. గత కొన్నేళ్లుగా పాత్రలు ఎంపికకి కొత్త ప్రాధాన్యం ఇస్తున్న ఆమెకి, ఈ పాత్ర మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని సమాచారం. వీ. శాంతారాం సినీరంగానికి చేసిన సేవలు, ఆయన వినూత్న ప్రయోగాలు, వ్యక్తిగత జీవితం ఇలా ఎన్నో అంశాలను ఈ బయోపిక్‌లో చూపించనున్నారు.ఈ చిత్రం బాలీవుడ్‌లో మరో ప్రతిష్టాత్మక బయోపిక్‌గా నిలుస్తుందని, అలాగే తమన్నా నటనకు కొత్త మైలురాయి అవుతుందని అభిమానులు, ఫిల్మ్ సర్కిల్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి.



# రాజ్ నిడుమోరుతో సమంత ఏడడుగులు

## రూమర్స్‌ను నిజం చేసిన జంట



టాలీవుడ్ స్టార్ నటి సమంత గత కొన్ని రోజులుగా నిత్యం హెడ్‌లైన్స్‌లో నిలుస్తోన్న విషయం తెలిసిందే. అందుకు కారణం రెండో పెళ్లే. బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు రాజ్ నిడుమోరుతో సమంత డేటింగ్‌లో ఉన్నారంటూ గత కొంత కాలంగా తెగ ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. త్వరలో వీరు పెళ్లి చేసుకోబోతున్నారంటూ సోషల్ మీడియాలో రూమర్స్ వచ్చాయి. ఇప్పుడు ఆ రూమర్సే నిజమయ్యాయి. సామ్-రాజ్ వివాహ బంధంతో ఒక్కటయ్యారు. కోయంబత్తూర్‌లోని ఇషా యోగా సెంటర్లో గల లింగ భైరవి ఆలయంలో వీరి వివాహం జరిగింది. దక్షిణాది సంప్రదాయం ప్రకారం వీరు పెళ్లి చేసుకున్నారు. ఎరుపు రంగు కంచిపట్టు చీరలో సమంత ఎంతో అందంగా రెడీ అయ్యారు. ఉదయం నిశ్చితార్థం, ఆ వెంటనే పెళ్లి కూడా జరిగిపోయింది. ఈ వేడుకకు దగ్గరి బంధువులు, స్నేహితులు హాజరయ్యారు. ఈ శుభవార్తను సమంత ఇన్‌స్టా వేదికగా అభిమానులతో పంచుకుంది. ఈ మేరకు పెళ్లి ఫొటోలను కూడా షేర్ చేసింది. ప్రస్తుతం ఈ ఫొటోలు వైరల్ అవుతున్నాయి. ఇవి చూసిన నెటిజన్లు, అభిమానులు సామ్-రాజ్ జంటకు శుభకాంక్షలు చెబుతున్నారు. పలువురు సెలబ్రిటీలు సైతం శుభాకాంక్షలు చెబుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

# 'నన్ను జడ్జ్ చేయండి'.. అషు రెడ్డి బోల్డ్ లుక్ వైరల్

సోషల్ మీడియాలో నిత్యం ఏదో ఒక సెన్సేషన్ క్రియేట్ చేస్తూ వార్తల్లో నిలిచే పేరు అషు రెడ్డి. డబ్స్మాష్ వీడియోలతో 'జూనియర్ సమంత'గా గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ, తక్కువ సమయంలోనే స్టార్ సెలబ్రిటీ హోదాను దక్కించుకున్నారు. వెండితెరపై కనిపించింది తక్కువే అయినా, సోషల్ మీడియాలో మాత్రం అగ్ర హీరోయిన్లకు ఏమాత్రం తీసిపోని ఫాలోయింగ్ను సొంతం చేసుకున్నారు. తన గ్లామర్తో, బోల్డ్నెస్తో ఇంటర్నెట్ను షేక్ చేయడం ఆమెకు వెన్నతో పెట్టిన విద్య.

తాజాగా అషు రెడ్డి తన వెకేషన్కు సంబంధించిన ఫొటోలను ఇన్స్టాగ్రామ్లో పంచుకున్నారు. ప్రస్తుతం ఆమె బాహామాస్లోని అందమైన లొకేషన్లలో చిల్ అవుతున్నారు. అక్కడ దిగిన ఫొటోలలో.. లైట్ ఆలివ్ గ్రీన్ కలర్ డ్రెస్సు ధరించి ఎంతో స్టైలిష్గా, గ్లామరస్గా దర్శనమిచ్చారు. సూర్యకాంతిలో చేతులతో లవ్ సింబల్ పెడుతూ, తన వంపుసొంపులతో నెటిజన్లను కట్టిపడేస్తున్నారు. ముఖ్యంగా ఆమె ఇచ్చిన బోల్డ్ పోజులు, “నన్ను జడ్జ్ చేయండి” అంటూ పెట్టిన క్యాప్షన్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆమె కాన్ఫిడెన్స్కు, గ్లామర్కు నెటిజన్లు ఫిదా అవుతున్నారు. నితిన్ హీరోగా నటించిన 'చల్ మోహన్ రంగ' చిత్రంతో అషు రెడ్డి ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. ఆ తర్వాత బిగ్ బాస్ రియాలిటీ షోలో పాల్గొని తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. హౌస్లో ఉన్నన్ని రోజులు తనదైన ఆటతీరుతో, గ్లామర్తో ఆకట్టుకున్న ఆమె, బయటకు వచ్చాక తన క్రేజ్ను రెట్టింపు చేసుకున్నారు. ఆ మధ్య సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మతో చేసిన బోల్డ్ ఇంటర్వ్యూలు ఆమెను ఇంటర్నెట్ సెన్సేషన్గా మార్చేశాయి. ఆ ఇంటర్వ్యూల ద్వారా వచ్చిన పబ్లిసిటీతో ఆమె పాపులారిటీ అమాంతం పెరిగిపోయింది.

ప్రస్తుతం అషు రెడ్డి సినిమాల కంటే విదేశీ పర్యటనలు, సోషల్ మీడియా ప్రమోషన్లపైన ఎక్కువ దృష్టి సారించారు. తరచుగా దుబాయ్, అమెరికా వంటి దేశాలకు వెళ్తూ.. అక్కడి లగ్జరీ లైఫ్స్టైల్ను ఎంజాయ్ చేస్తున్నారు. ఖరీదైన కార్లు, బ్రాండెడ్ దుస్తులతో ఎప్పుడూ ట్రెండింగ్లో ఉంటారు. నటిగా మంచి బ్రేక్ కోసం ఎదురుచూస్తూనే, వెబ్ సిరీస్లు, టీవీ షోలతో బిజీగా గడుపుతున్నారు. సినిమా అవకాశాలు లేనప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం అషు రెడ్డి హవా కొనసాగుతూనే ఉంది.







# బలగం వేణు ఎల్లమ్మ

## త్వరలోనే హీరో పేరు వెల్లడిస్తామన్న దిల్ రాజ్

'ఎల్లమ్మ' సినిమా అనౌన్స్ చేసిన రోజు నుంచి ఈ చిత్రాన్ని వరుస ఇబ్బందులు వెంటాడుతున్నాయి. దర్శకుడు వేణు యూడుగంటి రూపొందిస్తున్న ఈ ప్రాజెక్ట్ పట్ల భారీ అంచనాలు ఉండగా, రెండేళ్లుగా హీరో ఎవరు అనే విషయంలో మాత్రం గందరగోళం కొనసాగుతోంది. మొదట ఈ సినిమాలో నేచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్నాడని ప్రకటించిన మేకర్స్, ఫస్ట్‌లుక్ కూడా విడుదల చేశారు. అయితే అనుకోని కారణాల వల్ల నాని ఈ ప్రాజెక్ట్ నుంచి వైదొలిగారు.తర్వాత ఈ చిత్రంలో నటించేందుకు శర్వానంద్ ఎంట్రీ ఇచ్చారు. కొంతకాలం తర్వాత ఆయనే తప్పుకున్నారు. అనంతరం నితిన్ హీరోగా ఫిక్స్ అయిపోయారని, షూటింగ్ కూడా త్వరలో ప్రారంభమవుతుందని నితిన్ స్వయంగా ప్రకటించారు.కానీ కొన్ని రోజులకే ఆయనను కూడా ఈ చిత్రం నుంచి తప్పించారని సమాచారం. ఇలా వరుసగా ముగ్గురు హీరోలు మారడంతో 'ఎల్లమ్మ' ప్రాజెక్ట్ భవిష్యత్తుపై ప్రశ్నలు మొదలయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో చివరకు ఈ చిత్రానికి సంబంధించి నిర్మాత దిల్ రాజు క్లారిటీ ఇచ్చారు. గోవాలో జరుగుతున్న 56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న దిల్ రాజు మీడియాతో మాట్లాడుతూ.. ఎల్లమ్మ సినిమాకు హీరో ఇప్పటికే ఫైనల్ అయ్యాడు. త్వరలో అధికారిక ప్రకటన విడుదల చేస్తాం. అలాగే హీరోయిన్ వివరాలు కూడా డిసెంబర్‌లో వెల్లడిస్తాం. మా బ్యానర్ నుంచి 2026లో ఆరు సినిమాలు రిలీజ్ అవుతాయి. వాటి వివరాలు త్వరలో వెల్లడిస్తాం. ప్రస్తుతం 'రౌడీ జనార్ధన్' షూటింగ్ జరుగుతోంది' అని తెలిపారు. దీంతో 'ఎల్లమ్మ' సినిమాను ఎదురుచూస్తున్న ఫ్యాన్స్‌కు ఇది నిజంగా గుడ్ న్యూస్. ఇన్ని మార్పుల తర్వాత కూడా ప్రాజెక్ట్ నిలిచేలా ఉండటం మేకర్స్ నమ్మకాన్ని చూపిస్తోంది. ఇప్పుడు అందరి చూపు కొత్త హీరో, హీరోయిన్ ఎవరన్న దానిపైనే ఉంది.ఈ సినిమా ఎప్పుడు సెట్స్ పైకి వెళుతుంది అనే దానిపై కూడా త్వరలోనే క్లారిటీ రానుంది. కొద్ది రోజుల క్రితం బలగం అనే చిత్రంతో బిగ్గెస్ట్ హిట్ కొట్టిన వేణు ఇప్పుడు తన రెండో చిత్రంతో ఎలాంటి విజయం అందుకుంటాడో చూడాలి.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463